## బీరప్ప స్వామి దేవాలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం

**కొత్తూర్, మార్చి 31, ప్రభాతవార్త :**
శేరిగూడ భద్రయపల్లి గ్రామంలోని బీరప్ప దేవాలయానికి, ఈశ్వర మెమోరియల్ ఫౌండేషన్ చైర్మెన్ ఎమ్మె మహేందర్ కురుమ రూ.లక్ష విరాళం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.... భక్తులుమనసంస్కృతి,సంప్రదాయాలు కాపాడుకుంటూ ఆధ్యాత్మికంగా మెలగడం అలవర్చుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో సీరిగూడ భద్రాయపల్లి గ్రామ పెద్ద కురుమ ఎమ్మె దర్శన్, సెల్వోజి బుడుగు శ్రీను, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎమ్మె సత్యనారాయణ, ఉపసర్పంచ్ ఎమ్మె బాల్‌రాజ్, ఎమ్మె నర్సింహ్మా, కాంగ్రెస్ నాయకులు ఎమ్మె సత్తయ్య, మాజీ సర్పంచ్ ఎమ్మె వెంకటయ్య, గోరెలా కాపురుల సంఘం అధ్యక్షులు కుమ్మరిగూడెం శ్రీశైలం, ఎమ్మె నరసింహ, ఎమ్మె అజయ్, గ్రామ కురుమ సంఘం అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి జాలగూడెం నర్సింహా, కడల శ్రీశైలం, కుమ్మరిగూడెం పాండు, ఎమ్మె ప్రవీణ్, కోటయ్య తదితరులు ఉన్నారు.



రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త

## ఘనంగా రంజాన్



**మేడ్చల్, మార్చి 31. ప్రభాతవార్త :** మేడ్చల్‌లో రంజాన్ వేడుకలు ఘనంగా జరిగాయి. పట్టణంలోని మజీద్, ఈద్గ వద్ద ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున ముస్లిం సోదరులు వేడుకల్లో పాల్గొని ఒకరి కొకరు ఆలింగణం చేసుకుని పండుగ శుభాకాంక్షలు తెలుపుకుని ఉపవాస దీక్షలు విడిచారు. అదే విదంగా కులమతాలకతీతంగా ప్రజలు శుభాకాంక్షలు అందజేసుకున్నారు. మండలంలోనిగుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీ,రావల్‌కోల్, డబిల్‌పూర్, శ్రీరంగవరం, రాజ బొల్లారం, అత్వెల్లి తదితర గ్రామాల్లో ముస్లిం సోదరులు పండుగను పురస్కరించుకుని స్థానిక మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

## భక్తిశ్రద్దలతో రంజాన్ వేడుకలు

### శుభాకాంక్షలు తెలిపిన రాష్ట్ర చీఫ్ విఫ్, ఎమ్మెల్యే



రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న నేతలు

**తాండూరు, మార్చి 31, ప్రభాతవార్త:** తాండూరులో రంజాన్ పండుగను ముస్లింలు భక్తిశ్రద్దలతో జరుపుకొన్నారు. మతమేదైనా పరమాత్మం ఒక్కటే అనే తత్వంతో హిందూ, ముస్లింలు పరస్పరం సోదర భావంతో "ఈద్ ముబారక్" అంటూ శుభాకాంక్షలు తెలిపారు. నెల రోజుల పాటు చేపట్టిన ఉపవాస ధీక్షల అనంతరం ఈద్- ఉల్-ఫితర్‌గా పిలుచుకునే రంజాన్ పండుగను ఉత్సాహంగా జరుపుకొన్నారు. పండుగను పురస్కరించుకుని పిల్లలు, పెద్దలు నూతన వస్త్రాలు ధరించారు. భక్తి శ్రద్దలతో ప్రార్థనలు చేశారు. రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణ శివారు చెనిగెష్‌పూర్ రోడ్డు మార్గంలోని ఈద్గా మైదానంలో సామూహిక ప్రార్థనలు జరిపారు. ఈద్గా కమిటీ ఆధ్వర్యంలో ఈ ప్రార్థనలు నిర్వహించారు. సామూహిక ప్రార్థనల్లో వేలమంది ముస్లింలు ప్రార్థనలు చేశారు. దాదాపు గంటపాటు ఈద్గా మైదానంలో ఈ ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ఈ వేడుకల్లో రాష్ట్ర చీఫ్ విఫ్ పట్నం మహేందర్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే మనోహార్‌రెడ్డి, రాష్ట్ర బిసీ కమిషన్ మాజీ సభ్యులు శుభప్రద్ పటేల్, మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, జిల్లా డిసిసిబి వైస్ చైర్మన్ రవిగౌడ్, డిసిసిబి మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి, పెద్దేముల్ మాజీ జెడ్పిటిసి ధారాసింగ్, సీనియర్ నాయకులు డాక్టర్ సంపత్‌కుమార్, అబ్దుల్ రావూఫ్, మైనార్టీ నేతలు తదితరులు పాల్గొని ముస్లింలకు రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. మరోవైపు ఈద్గా మైదానంలో సామూహిక ప్రార్థనలను దృష్టిలో ఉంచుకోని పోలీసు యంత్రాంగం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసింది. తాండూరు డిఎస్పీ బాలకృష్ణారెడ్డి, రూరల్ సీఐ నగేష్, పట్టణ సిఐ సంతోష్‌కుమార్ ఆద్వర్యంలో బందోబస్తును ఏర్పాటు చేశారు. అదేవిదంగా బల్దియా ఆధికారులు కూడ భారీ ఏర్పాట్లు చేశారు. అనంతరం నేతలంతా ఈద్గాకమిటి ఇచ్చిన తేనీటివిందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఈద్గా కమిటి ప్రతినిధులు, మైనార్టీ ప్రముఖులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## జనగణనతో పాటే కులగణన చేపట్టాలి



ఛలో ఢిల్లీ కార్యక్రమంలో బిసి సంఘం నాయకులు

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, మార్చి 31, ప్రభాతవార్త:**
దేశవ్యాప్తంగా జనగణనలో కులగణన చేపట్టాలని బీసీలకు విద్యా,ఉద్యోగ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ప్రత్యేక రైలులో ఢిల్లీ బాట పట్టిన బీసీ యువజన సంఘం రాష్ట్ర కార్యనిర్వాక అధ్యక్షుడు ఈడిగ శ్రీనివాస్ గౌడ్, తాండూర్ బీసీ సంఘం నాయకులు. ఏప్రిల్ 2న న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగే బీసీల పోరు గర్జనకు చర్లపల్లి రైల్వే స్టేషన్ నుండి ప్రత్యేక రైలులో ఢిల్లీ బయలుదేరినట్లు బీసీ యువజన సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు ఈడిగ శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు స్థానిక సంస్థల్లో, విద్యా ఉద్యోగ రంగాల్లో 42 శాతం రిజర్వేష న్లు కల్పిస్తూ చేసిన చట్టాన్ని యధావిధిగా పార్లమెంట్లో చట్టం చేయాలని 2025 లో జరిగే జనగణలో కులగనణ నిర్వహించాలని 50శాతం పైగా ఉన్న ఓబీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని తెలిపారు. చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఈడిగ శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలకు అన్ని రంగాల్లో మొదటి నుంచి అన్యాయం జరుగుతునే ఉందని అన్నారు. ఒక బీసీ ప్రధానిగా ఉన్న బీసీలకు న్యాయం జరగట్లేదని విచారం వ్యక్తం చేశారు.ఢిల్లీకీ విక్రమ్ నరేష్ నరసింహ మల్లికార్జున్ పానగంటి విజయ్ వీరితోపాటు పెద్ద ఎత్తున బీసీ విద్యార్థి యువజన సంక్షేమ ఉపాధ్యాయ ఉద్యోగ సంఘాలు బయలుదేరడం జరిగింది.

## నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలి..

### ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**కొత్తూర్, మార్చి 31, ప్రభాతవార్త :**రానున్న వేసవి దృష్ట్యా మున్సిపాలిటీ పరిధిలో నీటి ఎద్దడి నివారణకు చర్యలపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.... కొత్తూర్ మున్సిపాలిటీలో వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. లీకేజీలు ఉన్నందున వచ్చే నీటిలో నీరు వృథా అవుతుందన్నారు. మున్సిపల్ అధికారులు పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి ఫిర్యాదులకు తావు లేకుండా జాగ్రత్తపడాలని సూచించారు. అలాగే ప్రతి వార్డులో రిపేర్ అయిన విధి బల్బుల స్థానంలో విధి బల్బులు సకాలంలో అమర్చాలన్నారు. మున్సిపాలిటీలో 100శాతం పన్నులు వసూలు చేయాలన్నారు. నాన్ ట్యాక్స్‌పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నెలలోపల అసెస్మెంట్ కానీ కంపెనీల ట్యాక్స్‌లను మదింపు చేసి పన్ను వసూలు చేసి మున్సిపాలిటీ ఆదాయాన్ని పెంచాలని కోరారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బాలాజీ, సిబ్బంది ఉన్నారు.

## ఆమనగల్లులో రంజాన్ పర్వదిన వేడుకలు



**ఆమనగల్లు, మార్చి31, ప్రభాతవార్త:** మండల కేంద్రంతోపాటు అన్ని గ్రామాలలో ముస్లిం సోదరులు సోమవారం రంజాన్ పర్వదిన వేడుకలను అత్యంత ఘనంగా జరుపుకున్నారు. రంజాన్ పండుగ పురస్కరించుకొని స్థానిక ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈద్గాల వద్దకు వయోభేదం లేకుండా ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ప్రార్థనల అనంతరం ఒకరికి ఒకరు ఆ లింగం చేసుకుంటూ రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈద్గాల వద్ద మతసామరస్యం వెలివిరిసింది. ఇతర మతాలకు చెందిన ప్రజలు కూడా అక్కడికి చేరుకుని ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఆమనగల్లులో జరిగిన రంజాన్ వేడుకల్లో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గొలు శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జయపాల్ యాదవ్, ఏఐసీసీ కార్యదర్శి చల్ల వంశీ చంద్ రెడ్డి, బాలాజీ సింగ్, డిసిసిబి డైరెక్టర్ గంప వెంకటేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ యాట గీత నరసింహ, టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, నాలాపురం శ్రీనివాస్ రెడ్డి, శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, గుర్రం కేశవులు, ఎంఏ ఖలీల్, జగన్, మానయ్య, వసుప్పుల శ్రీశైలం, వస్పుల శ్రీకాంత్, కృష్ణ నాయక్, మెకానిక్ బాబా , పత్య నాయక్, సయ్య ఖలీల్ తదితరులున్నారు.

# నేటి నుంచి రేషన్ షాపుల్లో సన్నబియ్యం పంపిణీ

### జిల్లాలో ఉన్న 5,28,881 (బిపిఎల్) రేషన్‌కార్డులు .ప్రతి నెల 619రేషన్‌షాపుల్లో 10,761.607 మెట్రిక్ టన్నుల సన్నబియ్యం పంపిణీ

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మార్చి 31, ప్రభాతవార్త**
మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా వ్యాప్తంగ రేషన్‌షాపుల ద్వారా ఏప్రిల్ 1వ తేదీ నుంచి సన్నబియ్యంను పంపిణీ చేయటానికి జిల్లా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు సిద్దం చేసింది. ఇప్పటికే రేషన్‌షాపులకు సన్నబియ్యం స్టాక్ వచ్చి పంపిణీకి సిద్దంగ ఉన్నట్లు సంబంధిత అధికారులు పేర్కొన్నారు. మంగళవారం ఉదయం 8గంటల నుంచి రేషన్‌షాపుల ద్వారా పేదలు రేషన్‌కార్డుదారులకు సన్నబియ్యంను ఒక్కరికి ఆరుకిలోల చొప్పున అందించటానికి అన్ని ఏర్పాట్లుసిద్దం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగ చేపట్టిన సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఉగాది పండుగ రోజున హుజరూనగర్‌లో సిఎం రేవంత్‌రెడ్డి లాంఛనంగ ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఇక అన్ని జిల్లాల్లోనూ ఏప్రిల్ 1వ తేదీ నుంచి ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించటంతో మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలోని అన్ని రేషన్‌షాపులకు సన్నబియ్యం అందే విధంగ చర్యలు తీసుకుని పంపిణీకి తగు చర్యలు చేపట్టింది. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలో ఉన్న 5,28,881రేషన్‌కార్డు (బిపిఎల్) దారులకు 10,761.607 మెట్రిక్ టన్నుల సన్నబియ్యం పంపిణీ చేయనున్నారు. దీనికి సంబంధించి జిల్లా వ్యాప్తంగ ఉన్న 619రేషన్‌షాపుల ద్వారా సన్నబియ్యంను పంపిణీ చేయటానికి జిల్లా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు సిద్దం చేసింది. పేదలకు ఇప్పటి వరకు రేషన్‌షాపుల ద్వారా అందిన దొడ్డు బియ్యంకు బదులుగా సన్నబియ్యంను అందించటానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవటం చారిత్రాత్మకమని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలు మేడ్చల్, మల్కాజ్‌గిరి, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, ఉప్పల్ ప్రాంతాలల్లో ఉన్న రేషన్‌షాపులలో సన్నబియ్యంను పంపిణీ చేయటానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. జిల్లా సంబంధిత అధికారులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేశారు. ఇక జిల్లా వ్యాప్తంగ రేషన్‌కార్డుదారులకు సన్నబియ్యం అందనున్నందున ఈ విషయం ప్రజల్లో చర్చనీయాంశంగ మారింది. కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు సన్నబియ్యంను అందించటానికి శ్రీకారం చుట్టటంతో మద్య తరగతి,పేద వర్గాల్లోమాత్రం ఉత్సాహం నెలకొన్నట్లు చెప్ప వచ్చు.



రేషన్‌షాపులో కార్డుదారులకు రేషన్‌బియ్యం పంపిణీ (ఫైల్‌ఫోటో) దృశ్యం

# ఈద్గాల వద్ద ముస్లిం సోదరుల రంజాన్ ప్రార్థనలు

### రాష్ట్ర హాజ్ కమిటీ మెంబర్ ఎండి ముజీబుద్దీన్ ఏర్పాటు చేసిన రంజాన్ విందులో..పాల్గొన్న నియోజకవర్గ నాయకులు, సిఐ, కమిషనర్



ఫోటోవార్త..31ఎస్‌హెచ్‌పిటి1.శామీర్‌పేటలో రాష్ట్ర హాజ్ కమిటీ మెంబర్ ఎండి ముజీబుద్దీన్ ఏర్పాటు చేసిన రంజాన్ విందులో పాల్గొన్న మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర

**శామీర్‌పేట, మార్చి 31, ప్రభాతవార్త**
రంజాన్ పండుగను పురస్కరించుకుని శామీర్‌పేట మండల కేంద్రంలోని ఈద్గా వద్ద ముస్లీం సోదరులు భారీ సంఖ్యలో పాల్గొని ప్రార్థనలు చేసి ఆ తరువాత రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. సోమవారం ఉదయం శామీర్‌పేట మండల కేంద్రంలోని ఈద్గా వద్ద రంజాన్ పండుగను పురస్కరించుకుని ముస్లీం సోదరులు పాల్గొని ప్రార్థనలు చేశారు. ఆ తరువాత రంజాన్ పండుగ సందర్భంగ ముస్లీం సోదరులు పలువురు ఆలింగనం చేసుకుని రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. నెల రోజుల నుంచి రంజాన్ సందర్భంగ ఉపవాసాలు ఉండి ఆదివారం సాయంత్రం చంద్రుడు నెలవంక కనిపించటంతో ముస్లీం పెద్దల సూచనల మేరకు రంజాన్ పండుగను సోమవారం ఘనంగ జరుపుకున్నారు. శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండలాల్లోని గ్రామాలలో, అదే విధంగ తూంకుంటలోని వివిధ గ్రామాలలో కూడ ముస్లీం సోదరులు ఈద్గాల వద్ద ప్రార్థనలు చేసి ఈదుల్ ఫీతల్ రంజాన్ పండుగను ఘనంగ జరుపుకున్నారు. ఆ తరువాత అదే విధంగ శామీర్‌పేటలో రాష్ట్ర హాజ్ కమిటీ మెంబర్ ఎండి ముజీబుద్దీన్ నివాసంలో రంజాన్ పండుగను పురస్కరించుకుని రంజాన్ విందును ఏర్పాటు చేయటంతో దీనిలో మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తోటకూర వజ్రేశ్‌యాదవ్, డిసిసి అధ్యక్షులు ఎస్.హరివర్ధన్‌రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు నక్క ప్రభాకర్‌గౌడ్, మేడ్చల్ ఎఎంసి చైర్మన్ బి.నర్సింలుయాదవ్, జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డిని, బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్‌ను, శామీర్‌పేట మండల కాంగ్రెస్ అధ్యక్షులు వై.శంకర్‌గౌడ్‌ను, మాజీ సర్పంచు బి.కిషోర్‌యాదవ్‌ను, చెరువుకట్ట చైర్మన్ ఎం.మహేందర్‌యాదవ్‌ను, ఎంసిపల్లి మాజీ వైస్‌ఎంపిపి ఎం.శ్రీనివాస్‌రెడ్డిని, మాజీ జడ్పీటిసిలు పి.బాలేశ్‌ను, ఎస్.శ్రీనివాస్‌యాదవ్‌ను, శామీర్‌పేట సిఐ శ్రీనాథ్‌ను, తూంకుంట మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్‌ను,పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు కె.కృష్ణారెడ్డి, ఎన్.విష్ణుగౌడ్, జె.నర్సింలు, ఓంప్రకాశ్, శ్రీకాంత్, రాజు, వి.మురళీగౌడ్, ధర్మారెడ్డి, యాదగిరి, ఎండి ఇర్ఫాన్, మాజీ ప్రజాప్రతినిధులను రంజాన్ పండుగ సందర్భంగ వారు ముస్లీం సోదరులకు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఆ తరువాత విందులో పాల్గొన్న తరువాత రాష్ట్ర హాజ్‌కమిటీ మెంబర్ ఎండి ముజీబుద్దీన్, జిల్లా మైనార్టీ పార్టీ నాయకులు ఎండి షఫీయుద్దీన్, ఎండి సమ్మిద్దీన్‌లు పాల్గొన్న ముఖ్య నాయకులను, అధికారులను ఘనంగ సన్మానించి సత్కరించి పాల్గొన్న వారికి వారు దన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు శామీర్‌పేట మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు,పలు పార్టీల నాయకులు,అభిమానులు పాల్గొన్నారు. శామీర్‌పేట ఈద్గా వద్ద జరిగిన ప్రార్థన సందర్భంగ పాల్గొని ముస్లీంలకు శుభాకాంక్షలు తెలిపిన మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్, మాజీ సర్పంచు బి.కిషోర్‌యాదవ్, మాజీ ఎంపిటిసి వి.సుదర్శన్, సొసైటీ వైస్‌చైర్మన్ ఎం.ఐలయ్యయాదవ్, ఎండి అఫ్జల్‌ఖాన్, ముజీబుద్దీన్, చాంద్‌పాష, షఫీయుద్దీన్, నజామ్, ఇంతియాజ్, పలువురు హిందూ, ముస్లీం నాయకులు పాల్గొని శుభాకాంక్షలు తెలిజేశారు.

# కొడంగల్‌లో ఘనంగా రంజాన్ వేడుకలు

### ఈద్గా మైదానంలో ముస్లీం సోదరుల ప్రత్యేక ప్రార్దనలు

కొడంగల్,మార్చి 31ప్రభాతవార్తముస్లీం సోదరులు పవిత్రంగా భావించే రంజాన్ పర్వదినం వేడుకలను సోమవారం కొడంగల్‌తో పాటుమండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఘనంగా జరుపుకున్నారు.రంజాన్ మాసంలో నెల రోజుల పాటు కఠోర ఉపావాస దీక్షలు చేపట్టిన ముస్లీం సోదరులు ఆదివారం సాయంత్రం నెలవంక కనబడడంతో సోమవారం తెల్లవారు జామునే నూతన వస్త్రాలు ధరించి స్థానిక జామ మసీదులో ప్రార్దనల అనంతరం పట్టణ శివారులోని ఈద్గా మైదానం వరకు ర్యాలీగా వెళ్ళారు.అనంతరం అక్కడే ప్రత్యేక ప్రార్దనలు నిర్వహించారు.ఈ సందర్భంగా జామ మసీదు కమిటీ అద్యక్షులు అబ్దుల్ హాఫీజ్ రషీద్ మాట్లాడుతు ఎంతో భక్తి ప్రవత్తులతో నెల రోజుల పాటు ఉపవాస దీక్షలతో అల్లా కరుణ కోసం కఠోర ఉపవాస దీక్షలతో రంజాన్ పండుగను జరుపుకోవడం జరుగుతుందన్నారు.ముస్లీం అత్యంత ప్రాముఖ్యతనిచ్చే మహ్మద్ ప్రవక్త సందేశాన్ని వివరిస్తు రంజాన్ మాసంలో ధానధర్మాలు చేపడితే ఎంతో పుణ్యం లభిస్తుందంటు రంజాన్ పర్వదినం విశిష్టతను వివరించారు.అనంతరం ఒకరికొకరు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.కాగ రంజాన్ పండుగను పురస్కరించుకొని మాజీ ఎమ్మెల్యేలు గురునాథ్‌రెడ్డి,పట్నం నరేందర్‌రెడ్డి ముస్లీం సోదరులకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.అలాగే మాజీ ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్‌లతో పాటు వివిధ పార్టీల నాయకులు,పట్టణ మాజీ ఉప సర్పంచ్ ఎస్.ఎం.గౌసన్,మహ్మద్ యుసుఫ్,మాజీ మున్సిపల్ చైర్మెన్ జగదీశ్వర్‌రెడ్డి,మాజీ మున్సిపల్ కౌన్సిలర్ మధుసుదన్‌యాదవ్, ఇందనూర్ బషీర్,కె.వి.రాజేందర్,ఎస్.బి.గుల్షన్ తదితరులు ఈద్గా మైదానానికి చేరుకొని ముస్లీం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.ఇదిలావుండగా స్తానిక సీఐ శ్రీధర్‌రెడ్డి,ఎస్సై సత్యనారాయణ తదితరులు ఈద్గా మైదానంకు చేరుకొని ముస్లీం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

కొడంగల్ మండల పరిధిలో...

రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం మండల పరిధిలోని హస్నాబాద్, పర్సాపూర్, ఎద్దనందిగామ, రావులపల్లి,అంగడిరాయిచూర్,రుద్రారం తదితర గ్రామాల్లో ముస్లీం సోదరులు వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.ఆయా గ్రామాల్లోని ఈద్గా మైదానాల్లో ప్రత్యేక ప్రార్దనలతో ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.ఈ సందర్భంగా హస్నాబాద్‌లో జరిగిన వేడుకల్లో మాజీ జడ్పీవైస్ చెర్మేన్ క్రిష్ణ,మాజీ సర్పంచ్ పకీరప్ప, పర్సాపూర్‌లో మాజీ సర్పంచ్ సయ్యద్ అంజద్, రుద్రారంలో దామోదర్‌రెడ్డి,సంజీవరెడ్డి తదితరులు పాల్గొని



పండుగ శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

## హనుమంత వాహనంపై ఊరేగిన శ్రీనివాసుడు

### -అంగరంగ వైభవంగా లంకాదాహనం
### -బ్రహ్మోత్సవాలకు పోటెత్తిన భక్త జనం

**కొడంగల్,మార్చి 31ప్రభాతవార్త:**



హనుమంత వాహనంపై ఊరేగుతున్న శ్రీవారు

పేదల పెన్నిదిగా పేరుగాంచి రెండవ తిరుపతిగా వెలుగొందుతున్న కొడంగల్ శ్రీమహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి 45వ వార్శిక బ్రహ్మోత్సవాలు భక్తుల కొలహలం మద్య అంతరంగ వైభవంగా కొనసాగుతున్నాయి.

తిరుమల తిరుపతి దేవస్థానానికకి అనుసంధానంగా కొనసాగుతున్న వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు టీటీడీ అర్చకులు శ్రీబాలాజీ బృంధం అద్వర్యంలో శాస్త్రోక్తంగా కైంకర్యాలతో మొదలుకొని స్వామివారికి ప్రత్యేక పూజలు కొనసాగుతున్నాయి.బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టంగా పేర్కొనే గరుడ వాహనం,లంకాదహన కార్యక్రమానికి భక్తులు పోటెత్తారు.తిరుమల తిరుపతి దేవస్దానం నుంచి అనవాయితీ ప్రకారం తీసుకువచ్చిన శేషవస్త్రానికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆదివారం స్వామివారికి అలంకరించారు.అనంతరం భక్తుల గోవింద నామస్మరణల మద్య స్వామివారు గరుడ వాహనంపై జాతర స్దలం వరకు ఊరేగుతు భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.అనంతరం అక్కడే అర్ధరాత్రి వరకు ప్రత్యేక పూజల అనంతరం లంకాదాహన కార్యక్రమం అంరగంగ వైభవంగా కొనసాగింది.లంకాదహన కార్యక్రమంలో తమిళనాడు రాష్ట్రానికి చెందిన వారు రంగురంగుల భాణాసంచా కాలుస్తుండగా మిరిమిట్లు గొలిపే సమయంలో యువకులు,చిన్నారులు కేరింతలు కొడుతు ఆనందోత్సవాల మద్య బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టంగా పేర్కొనే లంకాదహన కార్యక్రమం ముగిసింది.

కాగ బ్రహ్మోత్సవాల్లో సోమవారం స్వామివారి వసంత్సవ కార్యక్రమం భక్తుల గోవింద నామస్మరణల మద్య వైభవంగా కొనసాగింది.టీటీడీ అర్చకులు శ్రీబాలాజీ శ్రీదేవి,భూదేవి సమేతంగా స్వామివారికి విశేష అలంకరణల మద్య వసంతోత్సవ కార్యక్రమం కన్నుల పండువగా కొనసాగింది.అనంతరం స్వామివారికి ప్రతే ్యక అలంకరణలతో హనుమంత వాహనంపై ఊరేగుతు భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం సాయంత్రం వేళల్లో ఆలయంలో శ్రీమాన్ ధరూరీ శ్రీనివాసాచార్యుల అద్వర్యంలో నిర్వహించిన పంచాంగ శ్రవణ కార్యక్రమానికి పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.శ్రీవిశ్వవాసు నామ సంవత్సరంలో వర్షాలు సమృద్ధిగా కురుస్తు పంటలు బాగా పండుతు రైతులు,ప్రజలు సుఖ సంతోషాలతో జీవిస్తారని పేర్కొన్నారు.



వాజ్‌పేయ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దీపక్‌రెడ్డి, గౌతంరావు

## రాజకీయాలలో వాజ్‌పేయిది ప్రత్యేక స్థానం

### బిజెపి సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు దీపక్‌రెడ్డి

**హైదరాబాద్, మార్చి 31,ప్రభాతవార్త:** దేశ రాజకీయాలలో అటల్ బిహారీ వాజ్‌పేయికి ఒక ప్రత్యేకమైన స్థానం ఉందని హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి అన్నారు. అనంతరం బిజెపి నగర కార్యాలయం లో వాజ్‌పేయి శత జయంతి ఉత్సవాలకు సంబంధించి బండారు ప్రశాంత్ అధ్యక్షతన బూత్ అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులు ఆపై స్థాయి నాయకుల సమావేశం జరిగింది. సమావేశానికి దీపక్‌రెడ్డి, గౌతమ్‌రావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దీపక్‌రెడ్డి మాట్లాడుతూ దేశం కోసం వాజ్‌పేయ్ తన జీవితాన్ని అంకితం చేశారని ఆయన కొనియాడారు. ఆయన గురించి ప్రతి బూత్‌లో, ప్రతి డివిజన్‌లో కార్యక్రమాలను నిర్వహించి ప్రతి ఒక్కరికి తెలిసేలా చెయ్యాలని దీపక్‌రెడ్డి సూచించారు. అదేవిధంగా సీనియర్ నేత గౌతమ్‌రావు మాట్లాడుతూ సంకీర్ణ ప్రభుత్వాలను ఏ విధంగా నడిపించాలో నేర్పిన వ్యక్తి వాజ్‌పేయి అని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెవైఎం రాష్ట్ర కార్యదర్శి కె.ప్రవీణ్‌కుమార్, నేతలు నూనె బాలరాజు, మాజీ ఎస్సీ కమిషన్ సభ్యులు రాములు, కృష్ణగౌడ్, అజయ్, రాహుల్ చంద్ర, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కేశబోయిన శ్రీధర్, రాఘవరెడ్డి పాల్గొన్నారు.

## పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు సన్మానం




ఆర్టీసిలో పదవీ విరమణ చేసిన ఆరుగురిని సన్మానిస్తున్న డిఎం

**అడ్డగుట్ట, మార్చి 31 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ డిపోలో క్రమశిక్షణతో 35 సంవత్సరాలపాటు విధులు నిర్వహించి పదవీ విరమణ చేసిన ఉద్యోగుల సేవలను స్ఫూర్తిగా తీసుకొని తోటి ఉద్యోగులు విధులు నిర్వహించాలని కంటోన్మెంట్ డిపో మేనేజర్ సుధాకర్‌రావ్ అన్నారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ డిపోలో విధులునిర్వహిస్తున్న కంట్రోలర్లు బి.మల్లయ్య, బి.లక్ష్మణ్, ఏడిసి. వెంకట్‌స్వామి, కండక్టర్ బాబురాజా, డ్రైవర్లు సాహు, మధుగోపాల్ పదవీ విరమణ చేసిన సందర్భంగా సోమవారం వారిని పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సిఐ శ్రీపతి క్రిష్ణ, ఎం.ఎఫ్.బాల్‌రాజ్ తదితరులు పాల్గొని పదవీ విరమణ చేసిన ఉద్యోగులను తోటి ఉద్యోగులు శాలువాలు కప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

## మత సామరస్యానికి ప్రతీక 'తెలంగాణ'

### -మేయర్ గద్వాల్ విజయలక్ష్మి



రంజాన్ వేడుకల్లో పాల్గొన్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

**హైదరాబాద్, మార్చి 31, ప్రభాతవార్త:** మత సామరస్యానికి తెలంగాణా రాష్ట్రం ఇతర రాష్ట్రాల కంటే ఆదర్శంగా నిలుస్తుందని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. రంజాన్ పండుగ సందర్భంగా భోలక్ పూర్ వార్డు కార్పొరేటర్ గౌస్ మొయినుద్దీన్ ఆహ్వానం మేరకు సోమవారం మేయర్ విజయలక్ష్మి కార్పొరేటర్ ఇంటికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మేయర్‌ను సన్మానించి షిరుకుమను అందించారు. ఈ సందర్భంగా మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ... మత సామరస్యానికి తెలంగాణా రాష్ట్రం ఇతర రాష్ట్రాల కంటే ఆదర్శంగా నిలుస్తుందన్నారు, ముస్లిం హిందువులు స్నేహపూర్వకంగా ఉంటూ మతాలకు అతీతంగా స్నేహభావంతో ఉంటారని ముఖ్యంగా హైదరాబాద్ నగరం గంగా యమునా తెహజీబ్‌గా భారతంలోనే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. ముస్లిం హిందూ పండగలకు కలిసి మెలిసి ఉంటూ అన్నదమ్ముల జరుపుకునే వేదికగా హైదరాబాద్ నిలుస్తుందన్నారు. ఈదుల్ ఉల్ ఫితర్ (రంజాన్) పండుగకు ఆహ్వానించిన కార్పొరేటర్ గౌస్ మొయినుద్దీన్, వారి కుటుంబ సభ్యులకు మేయర్ రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

## మత సామరస్యానికి ప్రతీక రంజాన్ : కార్పొరేటర్



రంజాన్ వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ పావనీ వినయకుమార్

**చిక్కడపల్లి, మార్చి 31 ప్రభాతవార్త:** మత సామరస్యానికి ప్రతీక పవిత్ర రంజాన్ పండుగ అని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనీ వినయకుమార్ అన్నారు. సోమవారం గాంధీనగర్ డివిజన్‌లోని వాల్మీకినగర్‌బస్తీలోని బీజేపీ మైనారిటీ మోర్చ సీనియర్ నాయకులు మహ్మద్ మహమూద్, సబర్మతి నగర్ బస్తిలోని బీజేపీ నేతలు రహమాత్ అలి,యాసిన్ వారి కుటుంబ సభ్యులను.. కలిసి ఏర్పాటుచేసిన రంజాన్ వేడుకల్లో పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ. వినయ్‌కుమార్, డివిజన్ బీజేపీ పూర్వ అధ్యక్షులు రత్నసాయిచంద్, పలువురు నేతలతో కలిసి కుటుంబ సభ్యులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియ చేసారు. కార్యక్రమంలో బిజెపి డివిజన్ అద్యక్షులు వి.నవీన్ కుమార్, శ్రీకాంత్, వివిఎస్‌టి. రాజు, ఎం.ఉమేష్,సత్తి రెడ్డి,సురేష్,లక్ష్మణ్ యాదవ్, నర్సింహ, భరత, సాయికుమార్, ఆనంద్‌రావు, డి.కుమార్, ధనరాజ్ పాల్గొన్నారు.

## ప్రతిభచూపిన అభ్యర్థులకు సన్మానం

**చిక్కడపల్లి, మార్చి 31 ప్రభాతవార్త:** క్రమశిక్షణ, పట్టుదలతో కృషి చేస్తే తప్పకుండా పోటీపరీక్షల్లో విజయంసాధిస్తానని ప్రముఖ విద్యావేత్త, సిఎస్‌బి ఐఎఎస్ ఆకారమ్ డైరెక్టర్ బాలలత అన్నారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ విడుదల చేసిన గ్రూప్స్ 1 మెయిన్స్ ఫలితాల్లో మంచి మార్కులు సాధించిన అభ్యర్థులు కె.అనూషారెడ్డి, కొల్లిపాక కృష్ణసాయి, ఎం.శ్రావ్యతో పాటు వందలోపు ర్యాంపులు సాధించిన వారు ముప్పైమంది ఉన్నారు. సోమవారం సాయంత్రం గాంధీనగర్ లోని సంస్థ కార్యాలయంలో బాలలత సన్మానించి అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సంస్థ నుండి భారీ సంఖ్యలో అభ్యర్థులకు ఉత్తమ మార్కులు రావడం చాలా సంతోషంగా వుండన్నారు. వీరంతా ఉద్యోగాలు సాధించి ప్రజలకు ఎరుగైన సేవలు అందించే విధంగా ముందుకుసాగాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఆకాడమీ డైరెక్టర్ ఎం.ఉమేష్‌రెడ్డి, గ్రూప్స్ ఇంచార్జ్ ఆర్.నాగరాజు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరికీ కమ్యూనికేషన్ స్కిల్స్ ముఖ్యం

తెలంగాణ రాష్ట్ర ఉన్నతవిద్యామండలి పూర్వ చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి




శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్ అందజేస్తున్న ప్రొఫెసర్ లింబాద్రి

**చిక్కడపల్లి, మార్చి 31 ప్రభాతవార్త:** ఏం చదువుకున్నాం, ఏ ఉద్యోగం చేస్తున్నాం, ఏ రంగంలో ఉన్నాం అనేదాంతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరికీ తప్పకుండా ఉండాల్సిన నైపుణ్యం కమ్యూనికేషన్ అని తెలంగాణ రాష్ట్ర ఉన్నతవిద్యామండలి పూర్వ చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి అన్నారు. సోమవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విద్యాసంస్థలో మ్యాజిక్ బస్ ఆర్గనైజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో గ్రాడ్యుయేషన్ డే సందర్భంగా కమ్యూనికేషన్ స్కిల్స్ ఎనాలికల్స్ ఐ టెక్నాలజీ టూల్స్‌లో శిక్షణ పొందిన వారికి సర్టిఫికేట్లను అందించే కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రొఫెసర్ లింబాద్రి మాట్లాడుతూ మీ అభిప్రాయాలను, ఆలోచనలను, ఐడియాలను, భావాలను పంచుకోవడానికి కమ్యూనికేషన్ స్కిల్స్ చాలా ముఖ్యం. మీ మనసులో ఏముందో, ఏం అనుకుంటున్నారో స్పష్టంగా, సమర్థవంతంగా చెప్పగలగడం ఓ కళ. సూటిగా, స్పష్టంగా, అవసరమైనప్పుడు కళాత్మకంగా మన భావాలు, ఆలోచనలు, ఆదేశాలు అయినా చెప్పగలగాలి. వ్యాపారాలు నిర్వహించే వారు కస్టమర్లతో ప్రభావవంతంగా మాట్లాడటానికి, ఉద్యోగాల్లో ఉన్న వారు ఉన్నతోద్యోగులతో తమ పనితీరు గురించి ఎఫెక్టివ్ గా చెప్పడానికి కమ్యూనికేషన్ స్కిల్ ఉపకరిస్తుందన్నారు. ఈ కార్యక్రమములో ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ చాగంటి శ్రీనివాస్, విద్యాసంస్థ డైరెక్టర్ వై విష్ణు ప్రియ, కళాశాల వైస్ ప్రిన్సిపల్, హెచ్‌ఓడీలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జగదీశ్వర్‌గౌడ్

## కాంగ్రెస్ హయాంలోనే మైనార్టీల అభివృద్ధికి పెద్దపీట : జగదీశ్వర్ గౌడ్

**శేరిలింగంపల్లి,మార్చి 31 ప్రభాతవార్త**

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే మైనార్టీల అభివృద్ధికి, సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని శేరిలింగంపల్లి నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి, గ్రేటర్ హైదరాబాద్ స్టాడింగ్ కమిటీ సభ్యులు వి.జగదీశ్వర్ గౌడ్ అన్నారు. పవిత్ర రంజాన్ పర్వదినం సందర్భంగా మైనార్టీ సోదదరులను పలు ఈద్గాల వద్ద కలుసుకుని ప్రేమపూర్వకంగా ఆలింగన చేసుకుని ఈద్‌ముబారక్ తెలియజేశారు. మాదాపూర్ డివిజన్ ఆదిత్యనగర్‌లోని ఈద్గావద్ద సామూహిక ప్రార్థనలలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీతో కలిసి ముస్లింలతో రంజాన్ పర్వదినాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీల అభ్యున్నతికి వారి ఆత్మగౌరవాన్ని నిలిపేలా కార్యక్రమాలను నిర్వహించటం జరుగుతుందన్నారు. ఈ ఏడాది కాంగ్రెస్‌సర్కార్ ఎప్పుడూ లేని విధంగా మైనార్టీలకు రూ.3వేల కోట్ల బడ్జెట్‌ను కెటాయించినట్లు ఆయన తెలిపారు. మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా చదువుకునే యువతకు స్వయం ఉపాధి పథకాలతో పాటు నాలుగు పర్సంటేజీ రిజర్వేషన్లను కొనసాగిస్తున్నామన్నారు. అందులో భాగంగా గ్రూప్1 పరీక్షలతోపాటు గ్రూప్-4 ఉద్యోగాలకు నియామక పత్రాలు ఇచ్చినట్లు గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లింలకు ఫంక్షన్‌హాల్,మ్యారేజీ హాల్,ఇళ్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. దేశంలో ఎక్కడా కూడా ముస్లీంల కోసం ఇన్ని సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలు జరగటం లేదని, ముస్లింల ప్రగతిని కోరుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి అండగా నిలిచి రాష్ట్ర ప్రభుత్వ ఖ్యాతిని పెంచేలా సహకరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ హమీద్‌పటేల్,మాదాపూర్ డివిజన్ అధ్యక్షులు నగేశ్‌నాయక్,శివగౌడ్,వెంకట్‌రెడ్డి, రాంబాబు, బాబ్జి,ఆనంద్,మైనార్టీ నాయకులు మునఫ్‌ఖాన్, ఖాజా, హనీఫ్, ఇస్మాయిల్, హమీద్, లతీఫ్, సాహేల్, ఇమ్రాన్, రిజ్వాన్, ముష్రాఫ్, షేక్‌చంద్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## మైనార్టీ నాయకులకు రంజాన్ శుభాకాంక్షలు

**తార్నాక, మార్చి 31 ప్రభాతవార్త :** ఈదుల్ ఫితర్‌వేడుక రంజాన్ పండుగను పురస్కరించుకుని తార్నాక డివిజన్ లోని బీఆర్ఎస్ మైనార్టీలను బీఆర్ఎస్ గ్రేటర్ హైదరాబాద్ యూత్ అధ్యక్షులు ఆలకుంట హరి కలిసి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారిని ఆలింగనం చేసుకొని రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ముస్లింలకు కేసీఆర్ చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. హిందూముస్లిం అన్నదమ్ముల వలె ఉండాలని ఆలకుంట హరి కోరారు. ఈ కార్యక్రమంలో ఖాజా, యాకూబ్, నిజాం, ఇమ్రాన్, ప్రశాంత్, లంబడి నరసింహ, సత్యనారాయణ, వీరేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.



రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న ఆలకుంట హరి



మజ్జిగ పంపిణీ చేస్తున్న సత్యం చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు

## ఆనాథ చిన్నారులకు అండగా ఉంటాం

**శేరిలింగంపల్లి, మార్చి 31 ప్రభాతవార్త :** నిరుపేదలు, ఆనాథ చిన్నారులకు అండగా ఉంటూ సేవలందిస్తున్నట్లు సత్యం చారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ సత్యనారాయణ అన్నారు. శేరిలింగంపల్లి నియోజక వర్గంలోని నల్లగండ్ల ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద ఉన్న పేద,ఆనాథ చిన్నారులకు ఉగాది ప్రత్యేక పచ్చడితోపాటు మజ్జిగ, నీటి ప్యాకెట్లను సత్యం చారిటబుల్‌ట్రస్ట్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. హనీవెల్ టెక్నాలజీ సోల్యూషన్స్,ఎక్స్‌ఫోర్ట్ కంప్లైయన్స్ లాజిస్టిక్స్ మేనేజర్ బిక్కన్నవర్ వినోద్ హజరై ఈ సేవా వితరణ కార్యాక్ర మాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్యం చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ సత్యనారాయణ మాట్లాడుతూ.. సేవాభావంతో గత కొన్నేళ్లు గా తమవంతుగా సమాజానికిసేవ చేయటం, ఆనాథలకు, పేద చిన్నారులకు ఉచితంగా నోట్‌పుస్తకాల పంపిణీ,అన్నదాన వితరణ వంటి కార్యక్రమాలను చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. ప్రతి ఏటా మాదిరిగా ఈ ఏడాది పేద, అనాథ బాలబాలికలు బాగా చదువుకోవాలని, అభివృద్ధిలోకి రావాలని, సంపూర్ణ ఆరోగ్యంతో ఎప్పుడూ సంతోషంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో ట్రస్ట్ ఇంచార్జిలు అరవింద్, రమాదేవి, శ్రీధర్, ట్రస్టు సభ్యులు వసంత్, సుప్రజ,ఇతర కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### అంబలి కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే, కార్పొరేటర్

**నాచారం, మార్చి 31 ప్రభాతవార్త :**

నాచారం ప్రధాన రహదారి మహంకాళి ఆలయం ఎదురుగా దాచేపల్లి ధనలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అంబలి కేంద్రాన్ని సోమవారం భారాస మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జి రాగిడి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ శాంతి సాయి జెన్ శేఖర్‌తో కలిసి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బిఎల్ఆర్ మాట్లాడుతూ వేసవిలో పేదల ఆకలి,దప్పిక తీర్చేందుకు అంబలి కేంద్రం దోహదపడుతుందన్నారు. బాటసారుల ఆకలి తీర్చాలన్నా ట్రస్టు లక్ష్యం మనందరికీ స్ఫూర్తి దాయకమన్నారు. ఏ రంగంలోనైనా సేవ చేయడం ద్వారానే సంతోషం కలుగుతుందన్నారు. తమవంతు సామాజిక బాధ్యతగా దాచేపల్లి ధనలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ అంబలి కేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ట్రస్ట్ చైర్మన్ శరత్ బాబు మాట్లాడుతూ ప్రతిరోజు ఉదయం నుంచి 4వేల మందికి సుమారు 60 రోజుల పాటు అంబలి అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ వైస్ చైర్మన్ నాగ కిషోర్,అధ్యక్షుడు అరవింద్,ప్రధాన కార్యదర్శి రామ్ రాజ్, కోశాధికారి జె.నరసింహారావు ట్రస్టు ప్రతినిధులు సంతోష్ అరవింద్, హోప్ సన్, అభిరామ్,భరత్ నేతలు పాల్గొన్నారు.



అంబలిని అందజేస్తున్న ఎమ్మెల్యే బిఎల్ఆర్, కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్

# దొంగతనం చేసిన రెండు రోజులుకే నిందితుల పట్టివేత




స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలుతో ఎసిపి రాములు

**అల్వాల్, మార్చి 31 ప్రభాతవార్త:** చోరీ చేసిన రెండు రోజులుకే దొంగలు జైలు పాలైన సంఘటన అల్వాల్ పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. చోరీకి సంబంధించి సోమవారం అల్వాల్ పోలీసు స్టేషన్‌లో ఎసిపి రాములు మీడియాకు వివరించారు. ఓల్డ్‌అల్వాల్ లక్ష్మీ నగర్‌లో మార్చి 27వ తేదీన మహేందర్ గౌడ్ ఇంట్లో దొంగతనం జరిగింది. ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులు బంధువులు ఇంటికి వెళ్ళారు. 28వ తేదీన బాధితుని ఇంటికి తాళం పగలు కొట్టి ఉండడాన్ని గమనించి స్థానికులు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలిని సందర్శించి 16 తులాలు బంగారు ఆభరణాలు దొంగలు తస్కరించినట్లు నిర్ధారించారు. దొంగలను పట్టుకునే క్రమంలో సుమారు వంద సిసి కెమెరాలు ఫుటేజీలను పరిశీలించినట్లు ఎసిపి రాములు తెలిపారు. ఇదిలా ఉండగా దొంగల్లో ఒకరు పాత నేరస్తుడు ఉన్నట్లు నిర్ధారించుకున్నట్లు వివరించారు. దొంగతానికి పాల్పడింది హస్మత్‌పేట్‌కుచెందిన బండారి కౌశిక్(19) ఎల్బినగర్ వాస్తవ్యుడైన రవితేజ(20)గా గుర్తించారు. బండారి కౌశిక్ గతంలో గంజాయి కేసులో మల్కాజిగిరి పోలీసులు రిమాండ్‌కు విధించగా జైలుకు వెళ్ళి వచ్చిన చరిత్ర ఉంది. ఇరువురు చిన్ననాటి స్నేహితులు కాగా ఆర్థిక పరమైన ఇబ్బందులు నేపథ్యంలో తొమ్మిదవ తరగతి వరకు చదువుకుని ఆపేశారు. ఇరువురు హస్మత్‌పేట్ పాఠశాలలో చదువుకున్నారు. బతుకుదెరువు కోసం రవితేజ ఎల్బినగర్‌కు మకాం మార్చాడు. ఇరువురు ఏదో ఒక సందర్భంలో కలుసుకోవడం జరుగుతోంది. కౌశిక్ ప్రస్తుతం సికింద్రబాద్ ప్యారడైజ్ సర్కిల్ సమీపంలోని ఓ బట్టలు దుకాణంలో సేల్స్ మెన్‌గా మరో నిందితులు రవితేజ స్వీపర్‌గా పని చేస్తున్నారు. మార్చి 27వ తేదీన జాన్వి ఫంక్షన్ హాల్‌లో ఫుడ్ సప్లయ్ చేసే పని ఉందని రమ్మని కౌశిక్ రవితేజకు ఫోన్ చేశాడు. ఫంక్షన్ అయిన తరువాత అర్ధరాత్రి ఇరువురు మద్యం తాగారు. అనంతరం కౌశిక్‌కు చెందిన ద్విచక్ర వాహనంపై ఇంటికి బయలు దేరుతూ దొంగతనం చేద్దామని నిర్ణయించుకున్నారు. బైక్‌పై అల్వాల్ పరిసర ప్రాంతాలులో తిరుగుతూ తాళం వేసిన ఇంటి కోసం వెతకడం జరిగింది. ఓల్డ్‌అల్వాల్ లక్ష్మీ నగర్‌లో ఓ ఇల్లు తాళం వేసి ఉండడాన్ని గమనించి తమతో తెచ్చుకున్న సుత్తి సహాయంలో తాళం పగలు కొట్టి లోపలికి ప్రవేశించారు. బెడ్ రూము బీరువాలో ఉన్న బంగారు ఆభరణాలను దొంగలించారు.

బాధితుడు మహేష్‌గౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రంగ ప్రవేశం చేసిన పోలీసులు రెండు రోజులకే నిందితులను పట్టుకుని మొత్తం సొత్తును స్వాధీనం చేసుకుని జైలుకు పంపించారు. దొంగలను పట్టుకోవడంలో మంచి పని తీరును కనపరిచిన అల్వాల్ ఎస్‌హెచ్‌ఓ రాహుల్ దేవ్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ తిమ్మప్ప, సిసిఎస్ ఇన్‌స్పెక్టర్ దాలి నాయుడు క్రైమ్ సిబ్బందిని ఎసిపి రాములు అభినందించారు.



పంచాంగాన్ని ఆవిష్కరిస్తున్న కాసలనాడు బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య నాయకులు

## ఘనంగా ఉగాది వేడుకలు

**ముషీరాబాద్, మార్చి 31, ప్రభాతవార్త:** కాసలనాడు బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య, హైదరాబాద్ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. కవాడిగూడలోని ముదిగొండ శంకరాధ్య మఠంలో ఆదివారం సాయంత్రం నుండి రాత్రి వరకు నిర్వహించిన వేడుకలలో సమాఖ్య అధ్యక్షులు మిస్సుల శ్రీనివాసరావు స్వాగతోపన్యాసం చేస్తూ సమాఖ్య ఏర్పడిన నాటి నుండి చేపట్టిన కార్యక్రమాలు, సమాఖ్య లక్ష్యం తదితర అంశాలను వివరించారు. తేజోమూర్తుల రామకృష్ణశాస్త్రి గణన చేసిన విశ్వావస నామ సంవత్సర పంచాంగంను సమాఖ్య నాయకులు ఆవిష్కరించారు. అనంతరం రామకృష్ణశాస్త్రి పంచాంగ శ్రవణం ద్వారా నూతన సంవత్సరంలో గ్రహసంచారం వలన జరగబోయే ఫలితాలను వివరించారు. రామకృష్ణ శాస్త్రి దంపతులను శాలువా, మెమొంటోతో సమాఖ్య నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా లాస్య చేసిన నృత్యాభినయం, మిస్సుల రమ్య కర్ణాటక గాత్ర సంగీతం, గాధావజ్జుల అరుణ, స్వధా, కాశీచయనుల సత్యపద్మజలు ఆలపించిన లలిత గీతాలు ఆహుతులను అలరించాయి. ఈ వేడుకలలో సమాఖ్య కార్యవర్గ సభ్యులు నూకల రమాకాంత్, కొమ్మాజోస్యుల రాంకుమార్, కొమ్మాజోస్యుల వెంకటరామారావు, కొమ్మాజోస్యుల సుబ్రహ్మణ్యేశ్వర శర్మ, కపిలవాయి వెంకటరమణమూర్తి, కపిలవాయి వరప్రసాద్, కాకర్ల హనుమంతరావు, కందికుప్ప శ్రీనివాస్ ఆనంద్, తామరాపల్లి శివరాం, జల్లేపల్లి మాలతి, కొమ్మాజోస్యుల పద్మావతి, మిస్సుల పద్మావతి, కందికుప్ప సుధాలత తదితరులు పాల్గొన్నారు.

## విశ్వావసునామ సంవత్సర పంచాంగం ఆవిష్కరణ

**చిక్కడపల్లి, మార్చి 31 ప్రభాతవార్త:** దేశక్షేమం కోసం పాలకులు దైవకార్యక్రమాలు యజ్ఞయాగాలుచేస్తే తప్ప విశ్వావసు నామ సంవత్సరంలో కొంత ఉపశమనం లభిస్తుందని కళ్యాణ ఆనంద పీఠం అధినేత, శ్రీ విద్యాకంఠీరవ, ఆచార్య డాక్టర్ హనుమంతరాయ శర్మ అభిప్రాయపడ్డారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలోని పీఠం ఆవరణలో విశ్వావసునామ సంవత్సర పంచాంగ శ్రవణం కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విశ్వావసు నామసంవత్సరంలో ప్రతి రోజు పాలకులకు ఏదో ఒక అడ్డు తగులుతూనే ఉంటోందని, సరిహద్దు తగాదాలు, యుద్ధాలు సాగుతుంటాయని, ఆర్థిక సమస్యలు విపరీతంగా ఉంటాయని, రుణబాధలు ఎక్కువ అవుతాయన్నారు. ఈ సంవత్సరం మొదటి నాలుగు నెలలు కుజ గురు, రాహుకేతు, శనిగ్రహాలు అత్యధిక అనుకూల ప్రభావం చూపుతాయని, రైతాంగం తీవ్రంగా నష్టాన్ని ఎదుర్కొంటారని, తాను చేస్తున్నవవి, వివరణలు సూచనప్రాయం మాత్రమేనని అన్నారు. ముఖ్యంగా దేశ, జాతీయ నాయకులకు గండాలు ఎక్కువ అని, వాహన ప్రమాదాలు అధికంగా ఉంటాయని, శాస్త్రవేత్త కొత్త విషయాలను కనుగొంటారని అన్నారు. గత కొన్ని దశాబ్దాలనుంచి తాను పంచాంగాలను వెలువరిస్తున్నాని, విద్యోపాసకులుగా,, జ్యోతిష్కులుగా, ఆధ్యాత్మికవేత్తగా, సాహిత్యవేత్తగా, వాస్తునిపుణులుగా, జలాన్వేషకులుగా పేరును సంపాదించానన్నారు.

## పరంపరం నృత్య కళాకారులకు సత్కారం



నృత్యకళాకారులను సన్మానించిన దృశ్యం

**హైదరాబాద్, మార్చి 31,ప్రభాతవార్త:** ప్రసిద్ధి పరంపర అకాడమీకి చెందిన నృత్య కళాకారులను పలువురు ఘనంగా సన్మానించారు. జూబ్లీహిల్స్ రోడ్ నెం. 10లో ఎంపీ, ఎమ్మెల్యే కాలనీలో నిర్వహించిన ఉగాది వేడుకల్లో పరంపర కళాకారులు ప్రదర్శించిన పలు నృత్యరీతులు కళాకారులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా సిద్దార్థ జ్యూవెలర్స్ సెలబ్రిటీ డిజైనర్‌నాగిని ప్రసాద్ ,కాలనీ వాసులు వారిని ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మన సంస్కృతి, కళలను కాపాడుతున్న కళాకారులను ఉగాది వేళ సత్కరించుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డి, మాజీ టీటీడీ బోర్డు సభ్యురాలు గడ్డం సీతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మత సామరస్యానికి ప్రతీక రంజాన్

**కంటోన్మెంట్, మార్చి 31 ప్రభాతవార్త :** మత సామరస్యానికి రంజాన్ పండుగ ప్రతీక అని బిఆర్ఎస్ యువ నాయకులు టింకు గౌడ్ అన్నారు. రంజాన్ పర్వదినం సందర్భంగా సోమవారం బోయిన్‌పల్లిలోని పలువురు ముస్లిం సోదరులను కలిసి అందరికి రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు రంజాన్ మాసంలో నెలరోజుల పాటు ఎంతో కఠిన తరమైన ఉపవాస దీక్షలు చేపట్టి తమ భక్తిని చాటుకునే ముస్లిం సోదరుల భక్తి అభినందనీయం అని అన్నారు. చిన్న పెద్ద తేడా లేకుండా ప్రతి కుటుంబంలో ఎలాంటి లాభాపేక్ష లేకుండా కఠిన ఉపవాస దీక్షలు చేపట్టి నెలరోజుల అనంతరం ఉపవాస దీక్షలు వీడి రంజాన్ రోజు ఆనందోత్సవాల నడుమ వేడుకలు జరుపుకుంటారని, వారి జీవితాల్లో ఆనంద వెలుగులు నిండాలని సంతోషం వ్యక్తం చేశారు. ప్రతీ ముస్లిం కుటుంబంలో ఆనందోత్సాహాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు.



ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకుడు

## నాచారం ఆరిజన్ ఫ్యాక్టరీలో అగ్నిప్రమాదం

### స్క్రాప్‌లో చెలరేగిన మంటలు

**నాచారం, మార్చి 31 ప్రభాతవార్త :** మల్లాపూర్ పారిశ్రామిక వాడలో ఓ ఫ్యాక్టరీ ఆవరణలో సోమవారం అగ్నిప్రమాదం జరిగింది. ఆరిజన్ పరిశ్రమకు చెందిన స్క్రాప్ తగలబడటంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాద తీవ్రతకు భారీగా మంటలు ఎగిసిపడ్డాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని ఫైర్ ఇంజన్ల సాయంతో మంటలను అదుపు చేశారు. నాచారం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు.



మంటులంటుకున్న స్క్రాబ్



# భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు

**హైదరాబాద్, మార్చి 31 ప్రభాతవార్త**
ముస్లింల పవిత్ర రంజాన్ పండుగ (ఈద్ ఉల్ ఫితర్)ను సోమవారం అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పాతబస్తీలోని చారిత్రక మీరాలం ఈద్గా, మక్కా మసీదులో జరిగిన ప్రార్థనలో వేలాది మంది ముస్లింలు పాల్గొన్నారు. రంజాన్ పండుగ సందర్భంగా పాతబస్తీలో దక్షిణ మండ లం పోలీ సులు గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు. మీరాలం ఈద్గా, మక్కా మసీదులో ముస్లింలు సామూహిక ప్రార్థనలు నిర్వహించిన అంతరంరం జాన్ పండుగ శుభాకాంక్షలు తెలియ జేసుకున్నారు. ఒకరికొకరు ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ తెలుపుకున్నారు. మీరాలం ఈద్గాలో జరిగిన ప్రార్థనలో హైదరాబాద్ ఎంపి అసదుద్దీన్ ఓవైసీ, బహ దూర్‌పుర ఎమ్మెల్యే ముబీన్‌తో పాటు పలువురు పాల్గొన్నారు. నమాజు అనంతరం స్నేహితులు, బంధుమిత్రులు ఆలింగనాలు చేసుకొని ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకున్నారు. నగర పోలీసు కమి షనర్ సి.వి.ఆనంద్ బందోబస్తును పర్యవేక్షిం చారు. అదనపు పోలీస్ కమిషనర్ విక్రమ్‌సింగ్ మాన్, జాయింట్ సిపి జోయల్ డెవిస్, సౌత్ జోన్ డిసిపి స్నేహ మెహ్రాతో పాటు పలువురు పాల్గొన్నారు.



ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంపి అసదుద్దీన్ ఓవైసీ



పాతబస్తీలో బందోబస్తును పర్యవేక్షిస్తున్న నగర పోలీస్‌కమిషనర్ సి.వి.ఆనంద్

## ఆంజనేయస్వామి దేవాలయంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు షురూ

**చిక్కడపల్లి, మార్చి 31 ప్రభాతవార్త:** వివేక్‌నగర్ శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో ఆలయం తృతీయ వార్షికోత్సవాలు, శిలాఫలకముల ఆవిష్కరణ, సీతారాముల వారి కళ్యాణం, హనుమాన్ జయంతి వేడుకలను వైభవోపేతంగా నిర్వహించబోతున్నట్లు ఆలయం పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ సుధాకర్, ఈవో మాచర్ల దేవనాథం వివరించారు. ఇందులో భాగంగా సోమవారం మంటపారాధన కార్యక్రమం వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య జరిగింది. ఏప్రిల్ 1, 2వ తేదీలలో లక్ష్మీగణపతి హోమం, 3న అలివేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామివారి పెళ్లికొడులు, పెళ్లికూతురు, ఎదురుకోళ్లు, 4న శ్రీనివాసుడి కల్యాణం, 5న శ్రీవారి కల్యాణోత్సవం సందర్భంగా పసుపుల ముహూర్తము ఉంటుందని వివరించారు. 6న శ్రీరామ నవమి సందర్భంగా సీతారాముల కల్యాణోత్సవం వేడుకగా జరిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. 7న శ్రీరామపట్టాభిషేకం, 8న హనుమత్ కార్యసిద్ది హోమం, 9న సుదర్శనహోమం, 10న శ్రీరామతారక హోమం, 11న చండీహోమం, 12న సింధూర అభిషేకం, అదేరోజు హనుమాన్ జయంతి ఉంటుందన్నారు. మన్యుసూక్తపూర్వ అష్టోత్తర శతకలశ ఘటాభిషేకం, పంచామృత, వివిధ ఫలరస అభిషేకం, ఆకుపూజ, వడమాల పూజలు, మంత్రపుష్పం ఉంటుంద న్నారు. అదేరోజు సాయంత్రం సత్యనారాయణ స్వామి వ్రతాలుంటాయన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు. 13న, నవగ్రహ రుద్రహోమం, పూర్ణాహుతి, 14న సీతారాముల కళ్యాణ రథోత్సవం, కోలాటం, అన్నసమారాధన ఉంటుందన్నారు. కాగా పునర్నిర్మాణ, దేవతాప్రతిష్ట జరిగి మూడు సంవత్సరాలు అయిన సందర్భంగా విశేష పూజలుంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅర్చకులు బుగ్గాలక్ష్మీపతిశర్మ, అర్చకులు కందాళ వెంకటాద్రి. కమిటీ సభ్యులు జి.పద్మావతి, నిర్మల, ముక్కా రామకృష్ణ, గండి హరీష్, నెల్లి శ్యామ్‌కుమార్‌ముదిరాజ్, నీతారాణి, ఎం.లక్ష్మీనారాయణ,కంది సుబ్బారావు, దాసరి నవీన్ ప్రసాద్, వెన్నెలకంటి వెంకటశివకుమార్, కొత్తూరి వెంకట ప్రతాప్‌కుమార్, లోకనాథ్, ఎ.వెంకటరావు, మురికి గణేష్, ఎం.బి.రామ కోటేశ్వరరావు, ఒరుగంటి మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

# టార్గెట్ కంటే ఎక్కువే..

- ఆస్తిపన్ను వసూళ్లలో జిహెచ్‌ఎంసి రికార్డు
- 2024-25 ఆర్థిక సంవత్సరానికి 2012.36 కోట్లు వసూలు
- జిహెచ్‌ఎంసి చరిత్రలోనే తొలిసారిగా 2 వేలకోట్లు దాటినట్లు వెల్లడి




**హైదరాబాద్, మార్చి 31,ప్రభాతవార్త:**
హైదరాబాద్: ఆస్తి పన్ను వసూళ్లలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జిహెచ్ ఎంసి) రికార్డు సాధించింది. గ్రేటర్‌పరిధిలో పన్ను వసూళ్లు 2024-25 ఆర్థిక సంవత్సరానికిగానూ రూ.2012.36 కోట్లు వసూలైనట్లు జీహెచ్‌ఎంసీ వెల్లడించింది. జీహెచ్‌ఎంసీ చరిత్రలోనే తొలిసారిగా ఆస్తిపన్ను వసూళ్లు రూ.2వేల కోట్లు దాటినట్లు తెలిపింది. వన్‌టైమ్ సెటిల్మెంట్ (ఓటీఎస్) పథకం కింద రూ.465.07 కోట్లు వసూలైనట్లు జిహెచ్ ఎంసి పేర్కొంది. 2024-25ఆర్థిక సంవత్సరానికి ఆస్తిపన్ను లక్ష్యం రూ.1970.10 కోట్లుగా నిర్దేశించుకున్నారు. కానీ అదనంగా రూ.42.26 కోట్లు వసూలు చేశారు. మరో రూ.50కోట్ల వరకు రావచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. జీహెచ్ ఎంసీపరిధిలో 19.49లక్షల ప్రాపర్టీలు ఉన్నాయి. వీటిలో రెసిడెన్సియల్ 16.35లక్షలు, నాన్ రెసిడెన్షియల్ 2.80లక్షలు, మిక్స్‌డ్ 34 వేలు ఉన్నాయి. ఇప్పటివరకు సుమారు 16లక్షల మంది రూ.2012.365కోట్లు చెల్లించినట్టు సమాచారం. అత్యధికంగా శేరిలింగంపల్లి, చందానగర్, ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, కూకట్ పల్లి, ఎల్బీనగర్ ప్రాంతాల్లో ఆస్తి పన్ను వసూలవుతుందని అధికారులు చెబుతున్నారు. అలాగే చార్మినార్ జోన్‌లో అత్యల్పంగా వసూలైనట్లు తెలిపారు.కాగా జీహెచ్‌ఎంసీ రికార్డు స్థాయిలో ఆస్తిపన్ను వసూలు చేసేందుకుగాను అదనపు కమిషనర్(రెవెన్యూ) అనురాగ్ జయంతి, జాయింట్ కమిషనర్ మహేష్ కులకర్ణి బాగా కృషిచేశారని కమిషనర్ ఇలంబర్తి ప్రశంసించారు. వీరితోపాటు బిల్ కలెక్టర్లు, టాక్స్ ఇన్స్పెక్టర్లు, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు, జోనల్ కమిషనర్లు కష్టపడి పనిచేయడంతోనే టార్గెట్ కంటే ఎక్కువగా ఆస్తిపన్ను వసూలైందని కమిషనర్ తెలిపారు.

**నేటి నుంచి ఎర్లీబర్డ్ స్కీం..5 శాతం రాయితీ..**
హైదరాబాద్ నగర వాసులకు జీహెచ్‌ఎంసి మరో భారీ ఆఫర్ ఇచ్చింది. 2025-26 ఆర్థిక సంవత్సర ఆస్తి పన్ను చెల్లింపుపై కొత్త స్కీం ప్రవేశపెట్టింది. ఈ మేరకు జీహెచ్‌ఎంసీ అధి కారులు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎర్లీ బర్డ్ స్కీం ద్వారా ఆస్తిపన్ను ఏప్రిల్ 30వ తేదీ లోగా చెల్లిస్తే 5శాతం రాయితీ పొందే అవకాశం ఉంది. ఏప్రిల్ 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఎర్లీబర్డ్ స్క్రీం అందుబాటులో ఉండనుంది. కేవలం 2025-26 ఆర్థిక సంవత్సర ఆస్తి పన్నుకు మాత్రమే ఎర్లీ బర్డ్ స్కీం వర్తింస్తుందని తెలిపింది. గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బకాయిలపై ఎర్లీబర్డ్ స్కీం వర్తించని విషయం తెలిసిందే. అలాగే సోమవారం నాటికి 2024-25 ఆర్థిక సంవత్సర ఆస్తి పన్ను ఓటీఎస్ స్కీం ముగిసింది.

## సిఎం రేవంత్‌రెడ్డికి ఉగాది శుభాకాంక్షలు



సిఎం రేవంత్ రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

**కంటోన్మెంట్,మార్చి 31 ప్రభాతవార్త:**
ఉగాదిపండుగను పురస్కరించుకొని కంటోన్మెంట్ నియోజకవర్గం ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ ముఖ్య మంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి ఉగాది, రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**శ్రీరామనవమి వేడుకలకు రావలసిందిగా ఈటలకు ఆహ్వానం**
**కెపిహెచ్‌బి కాలనీ, మార్చి 31, ప్రభాతవార్త:** ఏప్రిల్ 6వ తేదీన కూకట్‌పల్లీలోని శ్రీ సీత రామచంద్రస్వామి దేవాలయంలో పెద్ద ఎత్తున నిర్వహించే శ్రీ సీతారాముల వారి కళ్యాణ మహోత్సవం కార్యక్రమానికి హాజరు కావలసిందిగా కోరుతూ సోమవారం ఆలయ ఈవో అంజయ్య మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ నివాసానికి బిజెపి రాష్ట్ర నాయకులు చేదురుపల్లి శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో వెళ్లి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు శ్రీనివాస్ చారి, పవన్ చారి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

### ఔరంగజేబు సమాధిని కూల్చివేసి

## సముద్రంలో వేస్తాం : రాజాసింగ్

**గోషామహల్, మార్చి 31ప్రభాతవార్త:** సంచనాలకు మారు పేరు గోషా మహల్ నియోజకర్గం బిజెపి శాసనసభ్యులు టి.రాజాసింగ్, ధర్మ పరిరక్షణ కోసం ప్రాణాలను త్యాగం చేసేందుకుగాను సిద్దంగా ఉన్నట్లు యువతను ఆకర్షి తులవుతుంటారు. హిందుదేశంలో పుట్టి హిందూ దేవతల శోభయాత్రలకు ఎందుకు అనుమతులు తీసుకోవాలని,మహారాష్ట్రలో ఔరంగ జేబు సమాధిన్ని కూల్చివేసి సముద్రంలో పడేస్తామని సంచలమైన వ్యాఖ్యలు చేశారు. అవసరమైతే మహరాష్ట్ర హిందువులకు మద్దతుగా తెలంగాణ నుంచి పెద్దసంఖ్యలో హిందులం తరలివెళ్తామన్నారు.అయోధ్యలో భవ్య రామమందిరం నిర్మాణం పూర్తైన తర్వాత బాబర్, ఔరంగజేబు వారసులు పరేషాన్ అవుతున్నారని హేళన చేశారు. ఈ వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారిందన్నారు. ముఖ్యంగా శ్రీరామ నవమి ఏప్రిల్ 6వ తేదిన నిర్వహించే శ్రీరామ శోభయాత్రను ఘనంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. శ్రీశోభ యాత్రకు హిందువులు,యువత పెద్దఎత్తున్న తరలిరావాలని పిలుపు నిచ్చారు.

### కాంగ్రెస్ నేత మాణిక్‌రావుఠాక్రేకు ఆహ్వానపత్రిక అందజేత



మాణిక్‌రావ్ ఠాక్రేకు ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న మోహన్

**అడ్డగుట్ట,మార్చి 31 ప్రభాతవార్త:** ఈ నెల 12న సికింద్రాబాద్ నార్త్ లాలాగూడలోని శ్రీవీరహన్‌మాన్ దేవాలయంలో నిర్వహించనున్న హన్‌మాన్ జయంతి వేడుకలకు హాజరు కావాలని ఏఐసిసి ఉపాధ్యక్షులు, బీహార్ కాంగ్రెస్ పరిశీలకులు మాణిక్ రావ్ ఠాక్రేకు సికింద్రాబాద్‌కు చెందిన కాంగ్రెస్ ఓబిసి ప్రధాన కార్యదర్శి ఎం.మోహన్ ఆహ్వాన పత్రికను అందజేశారు.

# టిజిఐఐసి ప్రకటనను ఖండించిన హెచ్‌సియు

**రెవెన్యూ అధికారులు 400 ఎకరాల్లో ఎలాంటి సర్వేచేయలేదని వెల్లడించిన యూనివర్సిటి**
**హెచ్‌సియు భూములపై డిఫెన్స్‌లో పడిన రేవంత్ సర్కార్**

**శేరిలింగంపల్లి, మార్చి 31 ప్రభాతవార్త**
హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రకటన విషయంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. టీజీఐఐసీకి కేటాయించిన స్థలం యాజమాన్యం, యూనివర్సిటీ భూముల హద్దుల నిర్ధారణ విషయంలో ఇవాళ రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రకటనను హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఖండించింది. 400 ఎకరాల భూమిని గుర్తించేందుకు యూనివర్సిటీ క్యాంపస్‌లో రెవెన్యూ అధికారులు జూలై 2024లో ఎలాంటి సర్వే నిర్వహించలేదని, తాజాగా హెచ్‌సీయూ రిజిస్ట్రార్ పత్రికా ప్రకటనను విడుదల చేశారు. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం కంచె గచ్చిబౌలిలోని 400 ఎకరాలపై యాజమాన్యం తమదేనని కోర్టులో సాధించిన విజయంతో ఆ భూములు ప్రభుత్వ పరం అయ్యాయని రాష్ట్ర సర్కార్ ఇవాళ ప్రకటన చేసింది. సర్వే నిర్వాహణ విషయంలో టీజీఐఐసీ జోనల్ మేనేజర్ 2024 జూలై 18న యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ రిజిస్ట్రార్‌కు మెయిల్ చేశారని, హెచ్‌సీయూ రిజిస్ట్రార్ సమ్మతితోనే 2024 జులై 19న యూనివర్సిటీ అధికారులు, యూనివర్సిటీ రిజిస్ట్రార్, యూనివర్సిటీ ఇంజనీర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, రెవెన్యూ అధికారులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, మండల సర్వేయర్ సమక్షంలో సర్వే నిర్వహించి అదే రోజున హద్దులు నిర్ధారించినట్లు ప్రభుత్వం తెలిపింది. అయితే ప్రభుత్వం చేసిన ఈ ప్రకటన తాజాగా హెచ్‌సీయూ రిజిస్ట్రార్ తోసిపుచ్చారు. ఇప్పటివరకు కేవలం భూమి ప్రాథమిక పరిశీలన మాత్రమే జరిగిందని పేర్కొన్నారు. ఇటీవల పత్రికల్లో వచ్చిన టీజీఐఐసీ ప్రకటనను కూడా యూనివర్సిటి ఖండించినట్లు పేర్కొన్నారు. యూనివర్సిటికి కేటాయించిన భూమి ఏదైనా బదిలీ జరగాలంటే అది యూనివర్సిటి కార్య నిర్వాహక మండలి అధికారిక సమ్మతితోనే జరుగుతుంది. ఈ విషయంలో యూనివర్సిటీ అడ్మినిస్ట్రేషన్ స్టేక్‌హోల్డర్స్, మీడియా ప్రతినిధులు యూనివర్సిటీ ధృవీకరించని ఏ సమాచారాన్ని వ్యాప్తి చేయటం ప్రచారం చేయవద్దని విజ్ఞప్తి చేశారు. ఓ వైపు ప్రతిపక్షాలు ఈ భూముల విషయంలో తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నవేళ తాము చేసిన ప్రకటనపై హెచ్‌సీయూ నుంచి వ్యతిరేకత రావడం రేవంత్ సర్కార్‌ను డిఫెన్స్‌లోనికి నెట్టినట్లైంది. మరి యూనివర్సిటీ ప్రకటనపై ప్రభుత్వం ఎలా రియాక్ట్ అవుతుందో వేచి చూడాలి.

## నీటి ఎద్దడి రాకుండా చర్యలు చేపట్టాలి : సాయిబాబా

**ముషీరాబాద్, మార్చి 31, ప్రభాతవార్త:** నీటి ఎద్దడి రాకుండా తెలంగాణ ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టాలని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా సూచించారు.సోమవారం టీడీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వేసవికాలం ప్రారంభంలోనే నగర శివారు ప్రాంతాలలో ప్రజలు తీవ్రమైన నీటి ఎద్దడి ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే గతంలో కర్నాటక రాష్ట్రంలో మాదిరి తాగడానికి కూడా నీళ్ల దొరకకుండా ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. నీటి ఎద్దడిని నివారించేందుకు హైదరాబాద్ మెట్రోల వాటర్ వర్క్స్ సరఫరా చేస్తున్న వాటర్ ట్యాంక్‌లను అధికార పార్టీ నాయకులకు, వారి అనుచరులకు కేటాయిస్తూ అధికార దుర్వినియోగంకు పాల్పడుతున్నారని ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న జలాశయాల్లో నీటి నిల్వలు రోజు రోజుకు తగ్గిపోతున్నాయని, భూగర్భ జలాలు పాతాళంలోకి పోతున్నాయని, ఇప్పుడే పరిస్థితి ఇలా ఉంటే వచ్చే రెండు నెలల్లో ఇంకెంత ఇబ్బందులు తలెత్తుతాయో ప్రభుత్వం ఆలోచించి, ముందస్తు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు నల్లెల్ల కిషోర్, పి.బాలరాజ్‌గౌడ్, ఎస్.ప్రకాష్ పాల్గొన్నారు



మాట్లాడుతున్న టిడిపి నేత సాయిబాబా

# పేదలకు వరం సన్నబియ్యం

**రాష్ట్ర బిసి ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్**

**ముషీరాబాద్, మార్చి 31, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన సన్నబియ్యం పథకం పేదలకు వరమని రాష్ట్ర బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్ కొనియాడారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ దేశంలో ఏ రాష్ట్రంలో అమలుచేయని విధంగా తెలంగాణ ప్రభుత్వం పేదలకు నాణ్యమైన ఆహారం అదించాలనే లక్ష్యంతో సన్నబియ్యం సరఫరా చేయటం అభినందనీయమని కొనియాడారు. గత ప్రభుత్వాలు దొడ్డు బియ్యం సరఫరా చేస్తే ఆ దొడ్డు బియ్యం తినలేక పస్తులు ఉన్న కుటుంబాలు ఎన్నో ఉన్నాయని, పది సంవత్సరాలు పాలన చేసిన బీఆర్‌ఎస్‌కు ఈ ఆలోచన రాకపోవటం దురదృష్టకరమని ఎద్దేవా చేశారు. గతంలో వరి సాగు చేస్తే ఉరి అన్న ముఖ్యమంత్రి ఆయన ఫామ్ హౌస్‌లో మాత్రం వరి పండించుకొని, క్వింటాలుకు నాలుగువేలు పొదిన విషయాన్ని ప్రజలు మరిచిపోరని హెచ్చరించారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 15 నెలల్లోనే ఇచ్చిన హామీలన్నీ అమలుచేస్తూ వస్తోందని, వ్యవసాయ కూలీలకు 12 వేల రూపాయలు అందచేయటం కూడా ప్రభుత్వ ఆలోచనలో ఉందని స్పష్టం చేశారు. రేషన్ కార్డులపై సన్నబియ్యం ఇచ్చే పథకం చరిత్రలో నిలిచిపోయే అంశమని కొనియాడారు.

## సీతారాములకు పూజలు

**బేగంబజార్, మార్చి 31 ప్రభాతవార్త:** శ్రీరామ నవమి ఉత్సవాలను పురస్కరించుకుని జాంబాగ్ డివిజన్ పరిధిలోని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గొల్కొండ బిజెపి జిల్లా అధ్యక్షులు టి.ఉమామహేందర్, జాంబాగ్ డివిజన్ బిజెపి కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్‌లు పాల్గొన్ని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు రఘు, శ్రీనివాస్‌యాదవ్, కటప్ప రామకృష్ణ, మయూర్ తదితరులు పాల్గొన్నారు.

# బాలాపూర్‌లో బెల్టుషాపులు... యధేచ్ఛగా అక్రమ మద్యం అమ్మకాలు

* 24 గంటలు అందుబాటులో మద్యం * గాల్లో కలుస్తున్న ప్రాణాలు * ఇప్పటికే వంద మంది వరకు మృతి.. ఆందోళనలో గ్రామస్తులు
* బెల్టు షాపులో సమరభేరి మ్రోగించిన గ్రామస్తులు * అఖిలపక్ష నేతలు, గ్రామ ముఖ్యుల సమావేశం *బెల్టు షాపులను మూయించాలని తీర్మానం

**సరూర్‌నగర్, మార్చి 31 ప్రభాతవార్త:**
గణేష్ లడ్డూ వేలాలు, వినాయక నవరాత్రి ఉత్సవాల నిర్వహణలో ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా దేశ, విదేశాల్లో విశేష ప్రాచుర్యం పొందిన హైదరాబాద్ నగర శివార్లలోని బాలాపూర్ గ్రామంలో బెల్టుషాపులపై గ్రామస్తులు సమరభేరి మ్రోగించారు. గడచిన కొన్నేళ్లుగా ఈ గ్రామంలో యధేచ్ఛగా రాత్రింబవళ్లు బెల్టు షాపుల ద్వారా మద్యం అందుబాటులో ఉండడం పేద, సామాన్య, మధ్యతరగతి ప్రజల కుటుంబాలకు శాపంగా మారింది. ఇప్పటికే బెల్టుషాపుల పుణ్యాన వేళాపాలా లేకుండా తాగుడుకు బానిసలై దాదాపు వందమంది వరకు చనిపోవడం జరిగింది. గ్రామంలోని దాదాపు ఎనిమిది, పది బెల్టు షాపుల్లో రౌండ్ ది క్లాక్ అంటే 24 గంటల పాటు మద్యం లభించడం దానికి బానిసలైన వారి కుటుంబాలకు శాపం అయింది. ఈ మహమ్మారివల్ల చనిపోయిన వారిలో అత్యధికులు కూలినాలి పనులు చేసుకునే పేదలు, చిన్నపాటి ఉద్యోగాలు చేసే సామాన్య, మధ్యతరగతి కుటుంబాలకు చెందినవారితో పాటు ఇతర సామాజిక కులాల వారు కూడా ఉండడం గమనార్హం. ఇటీవల కాలంలో మద్యం మహమ్మారికి వరుసగా కొంత మంది బలవడంతో గ్రామంలో కలకలం రేపింది. దీంతో అందరి దృష్టి మద్యం..దానిని అమ్మే బెల్టు షాపులపైకి వెళ్లింది. దీనిపై సామాజిక దృక్పథం ఉన్న కొందరు స్పందించి గ్రామంలో బెల్టు షాపులకు కళ్లెం వేయాలనే నిర్ణయానికి వచ్చారు.

**సమావేశమైన అఖిల పక్ష నేతలు, గ్రామ ముఖ్యులు**
ఈ నేపథ్యంలో సోమవారం గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్తలు పోరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి. నవారు శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో అఖిలపక్ష నేతలు, గ్రామ ముఖ్యులతో రాజకీయాలకతీతంగా, కులాలకు అతీతంగా ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో బెల్టు షాపుల వల్ల



బాలాపూర్‌లో బెల్టుషాపుల నిరోధానికి సమావేశమైన అఖిల పక్ష నేతలు, గ్రామ ముఖ్యులు

ఆగమవుతున్న కుటుంబాలు, చనిపోతున్న వారి విషయమై ఆందోళనలు వ్యక్తమయ్యాయి. ఏ సమయంలోనైనా గ్రామంలో మద్యం అందుబాటులో ఉండడం.. ఉదయం, పగలు, రాత్రి, మధ్యరాత్రి, తెల్లవారుజామున అనేది తేడా లేకుండా అవసరమైన వారికి మద్యాన్ని అమ్మే బెల్టు షాపులపై ఉక్కు పాదం మోపాలని వారంగా ఏకగ్రీవంగా నిర్ణయించారు. గడచిన కొన్నేళ్లల్లో మైనర్లు, యువకులతోపాటు అన్ని వయస్సుల వారు పెద్ద సంఖ్యలో మందుకుబానిసలై చనిపోవడాన్ని వారు సీరియస్‌గా తీసుకున్నారు. ముఖ్యంగా కూలీలు, మేస్త్రీలు, ఇతర చిన్నా చితకా పనులు చేస్తూ కుటుంబాలను పోషించే వారు మృతుల్లో ఉండడం.. వారి కుటుంబాలు రోడ్డున పడడంతో సమావేశానికి వచ్చిన వారంతా చలించిపోయారు. ఈ నేపథ్యంలో గ్రామంలో ఒక్క బెల్టు షాపు కూడా లేకుండా చేయాలని నిర్ణయించారు.

**పిఎస్, ఎక్సైజ్ స్టేషన్‌లలో ఫిర్యాదు చేయాలని నిర్ణయం**
కాగా బాలాపూర్ గ్రామంలో నడుస్తున్న బెల్టు షాపులపై స్థానిక బాలాపూర్ పోలీస్‌స్టేషన్‌లో అదే విధంగా సంబంధిత ఎక్సైజ్ స్టేషన్‌లో ఫిర్యాదులు చేయాలని సమావేశంలో అఖిలపక్ష నేతలు ఏకగ్రీవంగా తీర్మానించారు. స్వచ్ఛందంగా బంద్ చేయని బెల్టుషాపులపై దాడులు చేసి తిరిగి షాపులు నడవకుండా చేయాలని వారంతా ముక్తకంఠంతో నిర్ణయించారు. ఇక ఏ ఒక్కరూ బెల్టు షాపుల వల్ల నష్టపోవద్దనే దానిపై అందరూ ఒకే తాటిపైకి వచ్చి భవిష్యత్ కార్యాచరణను ప్రకటించారు. ఈ కీలక సమావేశంలో బాలాపూర్ గ్రామానికి చెందిన బడంగ్‌పేట్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చిగిరింత నర్సింహారెడ్డి, కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, సొసైటీ ఛైర్మన్ సింగిరెడ్డి పెంటారెడ్డి, మాజీ ఛైర్మన్ కొలన్ శంకర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు వంగేటి ప్రభాకర్‌రెడ్డి, ఎర్ర జైహింద్‌కుమార్, బండారి మనోహర్, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు గుండోజు రఘునందనచారి, ముఖ్య నేతలు వంగేటి లక్ష్మారెడ్డి, కళ్లెం ఎల్లారెడ్డి, కళ్లెం లక్ష్మారెడ్డి, కళ్లెం మల్లారెడ్డి, కొంతం సంపత్ రెడ్డి, రావుల మల్లేష్, అమ్జ బాల్‌రాజ్, మేకల సంజీవ, జోరల ప్రభాకర్, ఎమ్మార్పీఎస్ బొర్ర రవి, తిమ్మని గిరీష్, తూళ్ల నరహరిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# స్క్రాప్ దుకాణంలో అగ్నిప్రమాదం

**కాలిబూడిదైన వస్తువులు**

**హయత్‌నగర్, మార్చి 31 ప్రభాతవార్త:**
ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి స్క్రాప్ దుకాణంలోని వస్తువులు కాలి బూడిదైన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు... హయత్ నగర్ నుంచి ఇంజాపూర్ వెళ్లే దారిలోని పీఅండ్‌టీ కాలనీలో దుర్గాస్క్రాప్ దుకాణంలో సోమవారం సాయంత్రం 6 గంటల సమయంలో మంటలు చెలరేగాయి. దుకాణంతోపాటు పక్కనున్న ఖాళీ స్థలంలోని ప్లాస్టిక్ వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. సంఘటనలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరుగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. సంఘటనకు సమీపంలో చుట్టుపక్కల నివాసాలు ఉండడంతో ముందుగా అందరూ భయాందోళనకు గురయ్యారు. హయత్‌నగర్ అగ్నిమాపక యంత్రంతో పాటు మరో రెండు అగ్నిమాపక యంత్రాలతో సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చాయి. ప్రమాద విషయం తెలుసుకున్న హయత్‌నగర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించారు.





దుకాణంలో ఎగిసిపడుతున్న మంటలు, పరిశీలిస్తున్న పోలీసులు



## ఆలయ వార్షికోత్సవ వేడుకలు

**ఘట్‌కేసర్‌రూరల్, మార్చి 31, ప్రభాత వార్త:** పోచారం మున్సిపల్ ప్రతాప సింగారంలోని శ్రీ గుబ్బరిగుట్ట మైసమ్మ, ఎల్లమ్మ దేవాలయ ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఆలయ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా జరిగిన హోమం పూజల్లో మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది చంద్రకళ సుధీర్‌రెడ్డి దంపతులు పాల్గొన్నారు. అంతకు ముందు అమ్మవారికి గోపూజా, గణపతిపూజ పుణ్యాహవాచనం, మూల మూర్తులకు అభిషేక పూజలు నిర్వహించారు. అగ్ని ప్రతిష్టవంటి పూజలు చేశారు. హోమం పూజల అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్మన్, టీఎస్ పోల్యూషన్ బోర్డు సభ్యుడు మలిపెద్ది దీప్తిశరత్‌చంద్రారెడ్డి దంపతులతోపాటు మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంఛార్జీ తోటకూర వజ్రేశ్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కొండకల్ తండా వాసుల రిలే నిరాహార దీక్షలు

**శంకర్‌పల్లి, మార్చి31, ప్రభాతవార్త:** కబ్జాకు గురైన గిరిజనుల భూములను తిరిగి అప్పగించాని డిమాండ్ చేస్తూ చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారంతో 80వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా దీక్షలో కూర్చున్న పలువురు గిరిజనులు మాట్లాడుతూ బడ రియల్ ఎస్టేట్ సంస్థకు చెందినవారు తమ భూములను ఆక్రమించుకొని తమపైనే కేసులు పెట్టి వేధింపులకు పాల్పడుతున్నారన్నారు. ఈవిషయమై80రోజులుగా నిరసనలు చేస్తుంటే ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గుచేటని, వెంటనే ప్రభుత్వం స్పందించి తమ భూములు తిరిగి తమకు అప్పగించేలా చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలోఆందోళనకార్యక్రమాలు తీవ్రంచేస్తామని హెచ్చరించారు.



## పోలీసు ఉద్యోగాలు సాధించిన అన్నదమ్ములు

**మర్పల్లి, మార్చి31, ప్రభాతవార్త:** మర్పల్లి మండలంలోని గుర్రంగట్టు తాండాకు చెందిన పాండునాయక్‌కుమారులు, అంబర్ సింగ్, కానిస్టేబుల్‌గా, జైసింగ్, సెంట్రల్ ఎక్సైజ్ ఇన్స్పెకరటర్‌గా, ఉద్యోగాలు సాధించడంతో పలువురువారికుటుంబాన్నిఅభినంంచారు. బీదకుటుంబంలోపుట్టి, తల్లిదండ్రుల, శ్రమ తమచదువులకు అండగా ఉండగా తల్లిదండ్రుల ఆశయ సాధనకుఏకలవ్యునిగాకృషిచేసిసఫలీకృతులై, ఆ గిరిజన తాండాకే ఆదర్శంగా నిలిచారు. సోమవారం కాంగ్రెస్ జిల్లా ఉపద్యక్షులు రవెందర్, మర్పల్లి ఎస్సై సురేష్‌లువారినిసన్మానించారు. రవెంధర్ మాట్లా డుతూ రాత్రింబవళ్ల యకష్టపడి పిల్లలను చదివించిన పాండు నాయక్ దంపతులు ధన్యులు అన్నారు.. సెంట్రల్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్‌గా నాకు తెలిసినంతవరకు ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఎవ్వరు లేరని జిల్లాలోనే జెయసింగ్‌మొదటి వాడని ఆయన కొనియాడారు.. ఆర్థిపరంగా, బుక్స్‌పరంగా, ఏవైనాసమస్యలు ఉంటే మాతరపున వారికి సహాయ పడుతామన్నారునాయకులు నిఖిల్‌రెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, సంతోష్, బలవంత్ రెడ్డి, రాఘవేందర్, జగన్మోహన్‌ర్డి, పాల్గొన్నారు.

## మానసిక ఉల్లాసానికి క్రీడలు అవసరం

**చౌడపూర్, మార్చి 31 ప్రభాతవార్త :** చౌడపూర్ మండల పరిధిలోని మందిపాల్ గ్రామంలో ఉగాది, రంజాన్ పండుగ సందర్భంగా యువకులు క్రికెట్ క్రీడల పోటీలను నిర్వహించారు.. మానసిక ఉల్లాసానికి క్రీడలు అవసరమని, క్రీడల్లో రాణించి ఉత్తమ ప్రతిభను కనబరచాలని మందిపాల్ యువ నాయకుడు మఠం రాజశేఖర్ అన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు.. చాన్ పాషా, చంద్రకాంత్ , నర్సింలు, సాయి, కృష్ణ యువకులు, నాయకులు పాల్గొన్నారు

## సభా స్థలిని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్,

**కడ్తాల్ మార్చి 31, ప్రభాత వార్త :** ఏప్రిల్ 2న కడ్తాల్ మండలానికి మాజీమంత్రి తన్నీరు హరీష్ రావు రానున్న సందర్భంలో సోమవారం సరికొండ గ్రామపంచాయతీ పరిధిలోని బోయిన్ గుట్ట తండాలో సభా స్థలాన్ని మండల నాయకులతో కలిసి జైపాల్ యాదవ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హరీష్ రావు రాకను ప్రతిష్టాత్మకంగా తీసుకొని నియోజకవర్గం నుండి ప్రతి కార్యకర్త ముందుకు వచ్చి సభను విజయవంతం చేయాలని నాయకులకు సూచించారు. రానున్న స్థానిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని సూచించారు. మండల పార్టీ అధ్యక్షులు కంబల పరమేష్, పి ఎస్ ఎస్ చైర్మన్ వెంకటేష్ గుప్తా, మాజీ జడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్, విజిత రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, మాజీ సర్పంచులు నరసింహ గౌడ్, యాదయ్య, రవీందర్ రెడ్డి, హరిచంద్ నాయక్ ,భాగ్యమ్మ జంగయ్య, మాజీ ఎంపిటిసిలు లచ్చి రామ్ నాయక్, ప్రియా రమేష్ , కోఆర్డినేటర్ వీరయ్య, నాయకులు రామకృష్ణ, జంగయ్య, శ్రీను, అంజి,, సోమ్లా, బాబూజీ, రాజేష్ వినోద్, గోపాల్, వెంకటయ్య, రాజు, పర్వతాలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి జిల్లా అధ్యక్షుణ్ణి కలిసిన పగడాల శ్రీశైలం

**యాచారం, ఏప్రిల్ 1, ప్రభాత వార్త:** రంగారెడ్డి జిల్లా భారతీయ జనతా పార్టీ నూతన అధ్యక్షులుగా పంతంగి రాజు గౌడ్ ఎన్నికైన అనంతరం ఆయనను మర్యాదపూర్వకంగా బిజెపి బీజేవైఎం రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్ తక్కలపల్లి మాజీ ఉపసర్పంచ్ పగడాల శ్రీశైలం సోమవారం కలిశారు. ఈ సందర్భంగా శ్రీశైలం మాట్లాడుతూ.. భారతీయ జనతా పార్టీ క్రమశిక్షణకు మారుపేరని నూతన జిల్లా అధ్యక్షుడు రాజు గౌడ్ అన్న ఆధ్వర్యంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందనిఆయనఆకాంక్షించారు. నూతన అధ్యక్షులు అనధికాలంలోనే ఎన్నోసాంస్కృతిక సామాజిక కార్యక్రమాలన్నీ నిర్వర్తించారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. రాబోవు కాలంలో తెలంగాణ రాష్ట్రంలో భారతీయ జనతాపార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ముఖ్యంగా రంగారెడ్డి జిల్లాలో భారతీయ జనతా పార్టీ బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. లో బిజెపి మహేశ్వరం మండల అధ్యక్షులు యాదిష్, యాదయ్య గౌడ్, బోర్ర సాయిలు పాల్గొన్నారు.

## వీరశైవ సమాజ నూతన కమిటీ ఎన్నిక

**కోట్‌పల్లి, మార్చి31, ప్రభాతవార్త;** కోట్‌పల్లి మండల కేంద్రంలో సోమవారం నాడువీరశైవ సమాజనూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా గందేసురేష్, అధ్యక్షులుగా పత్తి సంగమేశ్వర్, ఉపాధ్యక్షులుగా నల్ల మల్లేశం, ప్రధాన కార్యదర్శిగా నిఖిల్, కోశాధికారిగా పత్తి అమర్నాథ్, సలహా సభ్యులుగా గందే చిత్ర శేఖర్, పోలే గౌరిశంకర్, రాజేశ్వర్, పత్తిసాగర్ ,అన్నసాగర్‌నరేష్‌లనువీరసమాజ సభ్యులు అధ్వర్యంలో ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా ఎన్నుకోబడిన కమిటీ సభ్యులు మాట్లాడుతూ. సమాజ అభివృద్ధికి తమవంతుగా కృషి చేస్తామని తమను ఎన్నుకున్నందుకు రాజ సభ్యులందరికి అభినందనలు తెలియజేశారు. వీరశైవ సమాజ సభ్యులు మాజీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు

## కాంగ్రెస్ పార్టీలో చేరికలు

**షాబాద్, మార్చి 31, ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీజేపీ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని దామర్లపల్లి గ్రామానికి చెందిన బీజేపీ నాయకులుకాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి మధుసూదన్రెడ్డి పార్టీ కండువ కప్పి పార్టీలోకి ఆహ్వానించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ఇరు గ్యారంటీలను అమలుచేస్తున్నారు. వచ్చేస్థానికఎన్నికల్లో సత్తా చాటుదా మన్నారు. మాజీసర్పంచులుజనార్ధన్‌రెడ్డి, లింగం, ఖాజా మియాపటేల్, గ్రీనివాస్ గౌడ్, రవిందర్ నాయక్, మహేందర్ గౌడ్, మాజీ ఎంపిటీసీలు చెన్నయ్య ఆశోక్, నాయకులు చేవెళ్ళ స్వామి, సుభాష్ రెడ్డి, రాఘవేందర్, రవీందర్, మాధవరెడి, మల్లారెడ్డి, బురాన్, దస్తగిరి, సత్యం, శేఖర్ లు పాల్గొన్నారు.

# భక్తి శ్రద్ధలతో ఈదుల్ ఫితర్ ప్రార్థనలు



రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ చైర్మన్ కొండల్‌రెడ్డి తదితరులు



గ్రామస్తులకు శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే నరేందర్ రెడ్డి



పులుమామిడిలో ఈద్గావద్ద శుభాకాంక్షలు తెలుపుకుంటున్న ముస్లీం సోదరులు

**కడ్తాల్‌మార్చి 31, ప్రభాత వార్త :** కడ్తాల్ మండల కేంద్రముతో పాటు మండల పరిధిలోని పలు గ్రామాల్లో ముస్లిం సోదరులు సోమవారం ఈదుల్ ఫితర్ ప్రార్ధనలు భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రము లోని ఈద్గా వద్ద మోలానా జహీరుద్దీన్ ఆధ్వర్యంలో రంజాన్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సీఐ శివ ప్రసాద్, ఎస్ఐ వర ప్రసాద్, ప్యాక్స్ చైర్మెన్ గంప వెంకటేష్ గుప్త, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, పీసీసీ సభ్యులు అయిల్ల శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ రెడ్డి, నాయకులు యాట నరసింహ, శ్రీనివాస్‌రెడ్డి, చేగూరి వెంకటేష్, బిచ్యా నాయక్, రామకృష్ణ, ఎర్రోళ్ల రాఘవేందర్, బిక్యనాయక్, సత్యం, రాజేష్, రామచంద్రయ్య, బాను కిరణ్, మాధవులు ఈద్గా వద్ద కు చేరుకొని ముస్లిం సోదరులకు శుభా కాంక్షలు తెలిపారు. మసీదుకమిటీఅధ్యక్షులుఅబ్దుల్ రవూఫ్, ఉపాధ్యక్షులు జావిద్, నాయకులు లాయక్ అలి జహంగీర్ అలి, జహంగీర్ బాబా, ఇర్షద్, అబ్దుల్ వహాబ్, గౌస్ , మహబూబ్ అలీ తదితరులు పాల్గొన్నారు.

**ఘట్‌కేసర్‌రూరల్‌లో..**

**ఘట్‌కేసర్‌రూరల్, మార్చి31, ప్రభాతవార్త:** పోచారం మున్సిపల్‌లో సోమవారం రంజాన్ పర్వదీన వేడుకలు ఘనంగా జరిగాయి. మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో మాజీ మున్సిపల్ చైర్మన్ బి. కొండల్ రెడ్డి, బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు మందాడి సురేందర్‌రెడ్డితో కలిసి పలు వార్డుల్లో పర్యటించి ముస్లీం సోదరులను కలిసి రంజాన్‌పండుగ శుభాకాంక్షాలు తెలిపారు. నారపల్లి, అన్నోజిగూడ తదితరు వార్డుల్లో మాజీ చైర్మన్ ముస్లీం సోదరులు మాజీ కోఆప్షన్‌సభ్యుడు అక్రం అలీ, జిలానీలను కలిసి పండుగ శుభాకాంక్షాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మోటుపల్లి శ్రీనివాస్, రాఘవేందర్, మహేశ్, నాసిర్, మురళి, శ్రీధర్, సంతోశ్, కొమ్ముల ప్రశాంత్, సంపత్, పల్లె బిక్షపతి గౌడ్ పాల్గొన్నారు.



**దుద్యాల్‌లో వేడుకలు..**

**దుద్యాల్, మార్చి 31, ప్రభాతవార్త:** మతసామరస్యానికి ప్రతీకగా రంజాన్ పండుగ ను నిర్వహించుకుంటారని కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ముస్లిం సోదరుల ను కలిసి పండగ శుభాకాంక్షలు తెలిపారు. దుద్యాల్, హస్నాబాద్, సంగాయిపల్లి, కుదురుమళ్ళ, హకీంపేట్, పోలేపల్లి, గౌరారం తదితర గ్రామాల్లోని ఈద్గాలలో ముస్లిం సోదరులు ఉదయం వేళలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం గ్రామాల ప్రధాన చౌరస్తాలో గ్రామస్తులకు, రాజకీయ నాయకులకు ఈద్ ముబారక్ తెలుపుతూ అలైబలై తీసుకున్నారు. బిఆర్ఎస్ దుద్యాల మండల పార్టీ అధ్యక్షుడు చాంద్ పాషా ఫామ్ హౌస్ లో విందు ఏర్పాటు చేసి అందరికీ పండగ శుభాకాంక్షలు తెలిపారు.

**ధారూర్‌లో..**

**ధారూరు, మార్చి 31, ప్రభాతవార్త:** రంజాన్ పర్వదిన వేడుకల ం మండలంలోని ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఈద్గాలో ముస్లింలు ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. గ్రామాల్లో మౌలానాలు రంజాన్ సందేశాన్ని వినిపించి అందులోని మంచి విషయాలకు వెల్లడించారు. ప్రతివ్యక్తి దానగుణం కలిగి ఉండాలని, తనకు ఉన్నదాంట్లో దానం చేయడమే గొప్ప లక్ష్యంగా భగవంతుడు పేర్కొన్నారనిగుర్తుచేశారు. ప్రతిఒక్కరూ మహ్మద్ ప్రవక్త చూపినమార్గాన్ని అ నుసరించాలనిసూచించారు. గ్రామాల్లో ఆనంద వాతావరణం నెలకొంది.



అలైబలై తీసుకుంటున్న చిన్నారులు

**నందిగామలో..**

**నందిగామ మార్చి31 ప్రభాతవార్త:** పండగలు సోదరభావానికి ప్రతి కలని నందిగామ ఎస్ఐ దేవరాజ్ మాజీ సర్పంచ్ కొమ్ము కృష్ణ స్పష్టం చేశారు. సోమవారం మండల కేంద్రమైన నందిగామలో వారు ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. మాజీ సర్పంచ్ కొమ్ము కృష్ణ మాట్లాడుతూ మైనార్టీలసంక్షేమం కోసంరాష్ట్రప్రభుత్వం ప్రత్యేక కార్యచరణ రూపొందించిందని చెప్పారు. కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా నాయకులు బోమ్మ గళ్ళ నర్సింలు, ముస్లిం పెద్దలు షేక్ అఖీమ్, ఎండి ఖదీర్ , పలువురు ముస్లిం తదితరులు పాల్గొన్నారు. ఫోటో రైట్ అప్: నందిగామలో ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన ఎస్సై

**నవాబుపేట మార్చి 31, ప్రభాతవార్త:** మండలంలోని ఆయా గ్రామాల్లో ముస్లీంలు సోమవారం రంజాన్ పండగను ఘనంగా జరుపుకున్నారు. నెల వంక దర్శణంలో ఉపవాస దీక్షలు విరమించి ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరిని ఒకరు కలిసి అలింగనం చేసుకుని పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఉదయం నిర్దేశించిన సమయానికి ఈద్గాల వద్దకు చేరుకుని పవిత్ర గ్రంథంలోని పండగకు సంబంధించిన ఆంశాలను హిమాంలు చదివి వినిపించారు. సోషల్ మిడియా విదికగా ఆయా మతాలకు చెందిన వారు ముస్లీంలకు పండగ శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్య, తదితర నాయకులు, ప్రముఖులు కూడా ముస్లీంలను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

**పూడూరులో రంజాన్ పండుగ వేడుకలు**

**పూడూరు, మార్చి 31, ప్రభాతవార్త :** పూడూరు మండలం పరిధిలోని వివిధ గ్రామాల్లో ముస్లీం సోదరులు సోమవారం రంజాన్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఎ.సక్రమ మార్గంలో నడుచుంటూ అల్లాయందు భక్తి విశ్వాసములు కలవారికి కర్మానుసారం మంచిదని, పవిత్రమైన జీవితాన్ని ప్రసాదించ బడుతుందని వివరించారు. ఈ సందర్భంగా పూడూరు, చెన్‌గోముల్, మన్నెగూడ, కడ్మూరు, కంకల్, పెద్ద ఉమ్మెంతాల్, రాకంచెర్ల, మేడిపల్లి కలాన్, మంచన్‌పల్లి, నిజాంనేట్ మేడిపల్లి, తుర్క ఎన్కెపల్లి, అంగడి చిట్టంపల్లి తదితర గ్రామాల్లో ఈద్గాలయందు ప్రార్థనలు చేసిన అనంతరం హిందువులు, ముస్లీంలు కుల మతాలకు అతీతంగా ఒకరికొకరు ఆలింగనం చేసుకొని రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అదే విధంగా మండలం పరిధిలోని మన్నెగూడకు చెందిన సీనియర్ కాంగ్రెస్‌పార్టీ నాయకుడు అజీంపటేల్ ఏర్పాటు చేసిన విందులో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పాల్గొని రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే వెంట మండల కాంగ్రెస్‌పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.



**శంషాబాద్‌లో.. శంషాబాద్. మార్చ్ 31. ప్రభాతవార్త :** నెల రోజుల ఉపవాస దీక్ష అనంతరం మైనార్టీలు జరుపుకునే రంజాన్ సందర్భంగ దుండుపల్లి నాయకుడు పారేపల్లి శ్రీనివాస్‌గౌడ్‌ఆధ్వర్యంలోముస్లిం సోదరులకు శుభా కాంక్షలు తెలియజేశారు. రంజాన్‌సందర్భంగాముస్లింలు తొండుపల్లి ఈద్గాలో సామూహిక ప్రార్థనలు జరిపిన అనంతరం మసీదు వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన షామ్యానా లో వారికి చల్లని పానీయాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. రెండు వర్గాల ప్రజలు ఒకరికొకరు వాలింగణం చేసుకొని ఈద్ ముబారక్ తెలిపారు. రషీద్‌పటేల్. అహ్మద్. షకీల్. పెదిరిపాటి ప్రవీణ్ గౌడ్. కొమ్మగంటిరాజు గౌడ్. పారేపల్లి ప్రసాద్. శేఖర్. ప్రవీణ్ గౌడ్. ఇంజమూర్ రాజు. దొడ్డ పెంటయ్య. కొండ దర్శన్. పెదిరిపాటి సుధాకర్ గౌడ్. సురేందర్. కొండ కుమార్. విష్ణు. సుఖానంద్. రమేష్. రాజు. దర్శన్. నాగరాజ్. నరేష్ ఈ కార్యక్రమంలో పాల్గొని రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు



కొడంగల్‌లో ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లిం సోదరులు

**పరిగిలో**

**పరిగి, మార్చి31 ప్రభాతవార్త :** రంజాన్ పండుగ సందర్భంగా వికారాబాద్ జిల్లా, పరిగి పట్టణ కేంద్రంలోని ఈద్గా వద్ద ముస్లిలు ఏర్పాటు చేసిన ప్రార్థనలో డిసిసి అధ్యక్షులు, పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి పాల్గొని, ముస్లింసోదరులకుశుభాకాంక్షలు తెలిపారు . ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రంజాన్ పర్వదినం పవిత్రతకు, త్యాగానికి, మత సామరస్యానికి రంజాన్ ప్రతీకగా నిలుస్తుందని, రాష్ట్రంలో హిందూ, ముస్లింలు సోదరభావంతో మెలగాలని, రాష్ట్ర ప్రభుత్వం ముస్లింల సంక్షేమానికి అన్ని విధాల సహకరిస్తుందని తెలిపారు.. పరిగిపట్టణంలోనిముస్లింమతపెద్దలు, నాయకులు, చిన్నారులుప్రత్యేకప్రార్థనలోపాల్గొని శుభాకాంక్షలుతెలుపుకున్నారు. మైనార్టీలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన పారేపల్లి శ్రీనివాస్ గౌడ్ .

**శంషాబాద్. మార్చ్ 31. ప్రభాతవార్త.**

నెలరోజులఉపవాసదీక్ష అనంతరం మైనార్టీలు జరుపుకునే రంజాన్ సందర్భంగ దుండుపల్లినాయకుడుపారేపల్లిశ్రీనివాస్‌గౌడ్‌ఆధ్వర్యంలో ముస్లిం సోదరులకుశుభాకాంక్షలు తెలియజేశారు. రంజాన్ సందర్భంగా ముస్లింలు తొండుపల్లి ఈద్గాలో సామూహిక ప్రార్థనలు జరిపిన అనంతరం మసీదువద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసినషామ్యానాలోవారికి చల్లని పానీయాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. రెండువర్గాలప్రజలుఒకరికొకరు ఆలింగనం చేసుకొని ఈద్ ముబారక్‌తెలిపారు. రషీద్ పటేల్. అహ్మద్. షకీల్. పెదిరిపాటి ప్రవీణ్ గౌడ్. కొమ్మగంటి రాజుగౌడ్. పారేపల్లి ప్రసాద్. శేఖర్. ప్రవీణ్‌గౌడ్. ఇంజమూర్ రాజు. దొడ్డ పెంటయ్య. కొండ దర్శన్. పెదిరిపాటి సుధాకర్ గౌడ్. సురేందర్. కొండకుమార్. విష్ణు. సుఖానంద్. రమేష్. రాజు. దర్శన్. నాగరాజ్. నరేష్ పాల్గొని రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు .

**కొడంగల్‌రూరల్‌లో..**

**కొడంగల్‌రూరల్, మార్చి31 ప్రభాతవార్త:** పవిత్ర రంజాన్ మాసం ముగింపుతో సోమవారంపండగనుముస్లింసోదరులుఘనంగా జరుపుకున్నారు. కొడంగల్ పట్టణంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో ముస్లిం సోదరులు సామూహిక ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈసందర్భంగారాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పోరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ముద్దప్పదేశ్‌ముఖ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎన్.ప్రశాంత్, మున్సిపల్ మాజీ చైర్మన్ జగదీశ్వర్‌డ్డి, మాజీ సర్పంచ్ రమేశ్‌రెడ్డి తదితరులు ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.



**షాబాద్‌లో**

**ఘనంగా రంజాన్ వేడుకలు షాబాద్, మార్చి 31, ప్రభాతవార్త:** షాబాద్ మండలంలో రంజాన్ వేడుకలు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఉదయం ఈద్గాల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆనంతరం ఒకరికి ఒకరు ఆలింగణం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ పట్నం అవినాష్ రెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

**దోమ మండలములో ..**

**దోమ. మార్చి31, ప్రభాతవార్త. దోమ** మండల పరిదిలోని ఆయా గ్రామాల్లో సోమవారం నాడు జరిపినరంజాన్ పండుగ వేడుకలు ఘనంగా జరిపారు. ఈ సందర్భముగదోమగ్రామపంచాయతీ ఆవరణలోపర్గి ఎమ్మెల్యే టి. రాంమోహన్‌రెడ్డిహజరై ముస్లీం సోదరులకు పండుగ శుభాకాంక్షలు తెలియ జేశారు. దోమ జమామజీద్, గవిని దగ్గర పర్గి మాజిఎమ్మెల్యే కె.మహేశ్‌రెడ్డి హజరై ముస్లీం సోదరులకు పండుగ శుభాకాంక్షలుతెలియ జేశారు. పండుగ సందర్భంగా హిందు ముస్లీం నాయకులు కలిసిఒకరికిఒకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మండలములోని అయినాపూర్, దిర్సంపల్లి, కిష్టాపూర్, దాదావూర్, బొంవల్లి, శివరెడ్డి వల్లి, ఉట్‌వల్లి, వోతక్కార్ గ్రామాలలో రంజాన్‌పండుగను ఘనంగా జరుపుకున్నారు. దోమ మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు విజయకుమార్‌రెడ్డి, మాజి సర్పంచ్ రాంచంద్రారెడ్డి, గ్రంథాలయ డైరెక్టర్ బంగ్ల యాదయ్యగౌడ్, మాలి శివకుమార్‌రెడ్డి, బాల్‌రెడ్డి, దస్తయ్య, బిఆర్ఎస్ నాయకులు దోమమాజిసర్పంచ్ రాజిరెడ్డి, మాజి జడ్‌పిటిసిలక్ష్మయ్య, మాజి యంపిపి రాజగోపాలాచారి, మండల పార్టీ అధ్యక్షులు గోపాల్‌గౌడ్, మాజి కోప్షన్ సభ్యుడు ఖాజపాషా, నరేందర్‌రెడ్డి, జిలానీ, ఖమర్, ముస్లీం సోదరులు పాల్గోన్నారు.



దోమ మండలములో

# షాద్‌నగర్‌లో ఘనంగా రంజాన్ ప్రార్థనలు

## సర్వమతాల సారాంశం ఒక్కటే
## షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**షాద్‌నగర్, ప్రభాతవార్త, మార్చి 31 :** సర్వమతాల సారాంశం ఒక్కటేనని, సర్వ ధర్మాలు జీవకోటి పరిరక్షణకు తోడ్పాటును అందిస్తాయని షాద్‌నగర్ ఎమ్మెల్యేవీర్లపల్లిశంకర్ అన్నారు. షాద్‌నగర్, ఫరూఖ్‌నగర్‌లో రంజాన్ పండగను పురస్కరించుకొని సోమవారం ముస్లీం సోదరులు పెద్దఎత్తున తరలివచ్చి ప్రార్థనలు చేశారు. ఈసందర్భంగాఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, కాంగ్రెస్ నాయకులుముస్లీంసోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల కలయికే రంజాన్ పండగ – మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌రంజాన్ సందర్భంగా ఫరూఖ్‌నగర్ ఈద్గా వద్ద నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలలో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పాల్గొని ముస్లీం సోదరులకు రంజాన్ పండగ శుభాకాంక్షలు తెలిపారు. క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల కలయికే రంజాన్ పండగ అని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. చిన్న పెద్ద తేడా లేకుండా నెలరోజుల పాటు ఉపవాస దీక్షలు చేయడం గొప్ప విషయమని అన్నారు. ప్రతి ఒక్కరు సోదర భావంతో మెలగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వంకాయల నారాయణ రెడ్డి, కడెంపల్లి శ్రీనివాస్ గౌడ్, మాజీ కౌన్సిలర్లు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, బీఆర్ఆర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అందరినీ సమానంగా గౌరవించడమే ఇస్లాం ధర్మం – ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్ కుమార్ రెడ్డిఇస్లాం మతంలో అందరినీ సమానంగా గౌరవిస్తారని, ధర్మాన్ని కాపాడుతూ పేదలకు ఆదుకునేందుకు ముందుంటారని పాలమూరు ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా వారు ముస్లీం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.



షాద్‌నగర్‌లో ప్రార్థనలు చేస్తున్న ముస్లీం సోదరులు

పవిత్ర మాసాన్ని ఆచరించి ఎందరికో దానధర్మాలు చేస్తూ ముస్లీం ధర్మం ప్రకారం నడుచుకుంటారని తెలిపారు. నటరాజన్, సుధీర్, పిల్లి శేఖర్, జూపల్లి శంకర్, చింటు ప్రతాప్ రెడ్డి, పర్వేజ్, అడ్డు, అజాజ్, గౌస్ జానీ, బచ్చని నరసింహ్మా పాల్గొన్నారు. అదేవిధంగా మైనార్టీ నేతలు, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సయ్యద్ సాదిక్, మాజీ ఎంపీపీ ఇద్రీస్ గృహాలలో రంజాన్ వేడుకలను ఘనంగా నిర్వహించగా, ఆయా వేడుకలకు మాజీ ఎంపీపీలు శివశంకర్ గౌడ్, పిన్నింటి మధుసూదన్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి, నాయకులు జాంగారి రవి, జాంగారి నరసింహ్మలు హాజరయ్యారు. అన్ని మత గ్రంథాల సారాంశం ఒక్కటే – మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులుఅన్ని మత గ్రంథాల సారాంశం ఒక్కటే అని మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలం విఠ్యాల గ్రామంలో నిర్వహించిన రంజాన్ వేడుకలలో ఆయన పాల్గొని ముస్లీం సోదరులకు రంజాన్ పండగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాల క్రితం విఠ్యాల గ్రామంలో ఈద్గాను తానే నిర్మించినట్లు తెలిపారు

## ఉగాది కానుకగా సన్నబియ్యం పంపిణి పథకం ప్రారంభం

**బొంరాస్‌పేట్, మార్చి 31, ప్రభాతవార్త:** ఉగాది కా నుకగా రాష్ట్ర ప్రభుత్వం పేదలకు రేషన్ దుకాణాల ద్వారా ఉచితంగా సన్న బియ్యం పంపిణీ పథకాన్ని ప్రారంభించనున్నట్లు మండల తహసీల్దార్ పద్మావతి తెలిపారు. సోమవారం మండల తహసీల్దార్ కార్యాలయంలో మండల తహసీల్దార్ విలేఖర్లతో మాట్లాడుతూ మండల పరిధిలో 19 రేషన్ దుకాణాలున్నాయని తెలిపారు. ఈ ంషన్ దుకాణాల పరిదిలో మొత్తం 16538 ఆహార భద్రత కార్డు దారులుండగా 55746మంది లబ్ది దారులున్నట్టు మండల తహశీల్దార్ తెలిపారు. పథకం లో భాగంగా ప్రతి లబ్ది దారుడికి 6 కిలోల సన్న బియ్యం ఉచితంగా అందిచనున్నట్టు ఎంఆర్ఓ తెలిపారు. అందులో ఆహార భద్రతా కార్డు దారులు 15392, అంత్యోదయ కార్డుదారులు 1128, అన్నపూర్ణ కార్డు దారులు 21 మంది ఉన్నట్లు మండల తహశీల్దార్ తెలిపారు. వీరికి ఆయా రేషన్ దుకాణాల ద్వారా ప్రతి నెల 3533.82 కిలోలు పంపిణి చేస్తున్నట్టు ఆమె తెలిపారు. ప్రభుత్వం ఉగాది కా నుకగా ప్రారంభించినట్లు సన్న బియ్యం పంపిణీ పథకం ను లబ్ధిదారులకు ఉన్నతాధికారుల ఆదేశా నుసారం ఏప్రిల్1వతేదీనుండిఅందించ నున్నట్టు మండల తహశీల్దార్ తెలిపారు.

## యాచారం రంజాన్ వేడుకలు

**యాచారం, ఏప్రిల్1 ప్రభాతవార్త....** యాచారం మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో రంజాన్ పర్వదినం పురస్కరించుకొని భక్తి శ్రద్ధలతో సోమవారంప్రార్థనలుచేశారు. మండల పరిధిలోని మేడిపల్లి, నంది వనపర్తి, నజ్దిక్ సింగారం మాల్, నల్లవెల్లి, గున్గల్, తాడిపర్తి ఆయా గ్రామాల ముస్లిం సోదరసోదరీమణులుభక్తి శ్రద్ధలతోరంజాన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యంగా నజ్దిక్ సింగారంలో పార్దనల అనంతరం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా యువ నాయకుడు జావేద్ మాట్లాడుతూ.. రంజాన్ మాసంలో ప్రతిరోజూ ఉదయం నుండి సాయంత్రం వరకు ఉపవాసం ఉండి భక్తి తో పాటు మానసిక ఆరోగ్యం ఉత్సాహాన్ని నింపిందని అన్నారు.